Vist us @ www.sooryasena.com

RNI.No.: TELTEL/2023/85598

# సూర్యసేన

మా అక్షరం ప్రజల మార్పు కోసం

తెలుగు దిన పత్రిక

Published from: Nalgonda - Hyderabad - Warangal - Khammam - Karimnagar - Mahabubnagar - Vijayawada - Guntur - Kurnool

ఆదివారం SUNDAY || 24.05.2026 || నల్గొండ NALGONDA || సంపుటి (Volume): 3 సంచిక (Issue) : 249 || పేజీలు (Pages) : 8 వెల (Rs.) : 2/- || ఎడిటర్: పాల్వాయి జానయ్య Editor: Palvai Janaiah







# యాదాద్రిలో తెలంగాణలోనే అతిపెద్ద వేద పాఠశాల, పలు అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన



**యాదగిరిగుట్ట మే, 23 (సూర్యసేన ప్రతినిధి):** శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన పరిధిలో తెలంగాణలోనే అతిపెద్ద వేద పాఠశాల సముదాయ నిర్మాణానికి, టెంపుల్ సిటీ పరిధిలో రూ. 99.55 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు ఆలయ అనుబంధ అభివృద్ధి పనులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూమిపూజ, శంకుస్థాపనలు చేశారు. యాదగిరిగుట్ట టెంపుల్ సిటీని తిరుమల తిరుపతి దేవస్థానం (ఋణ) తరహాలో ఉన్నతంగా తీర్చిదిద్దే సంకల్పంతో ఈ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. 15 ఎకరాల విస్తీర్ణంలో రూ. 43.80 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఈ వేద పాఠశాలలో 300 మంది విద్యార్థులకు వసతితో కూడిన వేద విద్యను అందించనున్నారు. రూ. 43.5 కోట్లతో దీక్షాపరుల మండపం పనులకు, రూ. 9.88 కోట్లతో కొండపై నిత్య కల్యాణం, రంగం మండపం నిర్మాణం, రూ. 1.41 కోట్లతో మెట్ల మార్గానికి పైకప్పు, రూ. 1.44 కోట్లతో మాఢవీధులకు మెట్ల పనులకు రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కంచికామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీ శ్రీ శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారి దివ్య సమక్షంలో శనివారం (మే 23, 2026)న జరిగిన ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. భక్తుల సౌకర్యార్థం డార్మిటరీ హాల్స్, దీక్షాపరుల సదనం, కొండపై భారీ కల్యాణ మండపం, మెట్ల మార్గానికి రక్షణ పైకప్పు (కానోపీ), కొత్త మెట్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. స్వామి వారి కృపతో రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సంతోషాలతో వర్ధిల్లాలని మనసారా కోరుకున్నారు. ఈ సందర్భంగా కంచికామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారి ఆశీస్సులు అందుకున్నారు.

## యువతకు మంచి భవిష్యత్తు ఇవ్వొద్దా..
### బీఆర్ఎస్‌పై మంత్రి శ్రీధర్ బాబు ఫైర్



**హైదరాబాద్, మే, 23 (సూర్యసేన ప్రతినిధి):** బీఆర్ఎస్ పార్టీ నేతలపై మంత్రి శ్రీధర్ బాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు చీప్ పాలిటిక్స్.. బ్లాక్ మెయిల్ పాలిటిక్స్ చేయొద్దని అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ఎక్కడ అభివృద్ధి చేస్తే అక్కడ ఆపుతామంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రజలు కోరుకున్నది తప్పకుండా చేసి తీరుతామన్నారు. వేలాది కోట్లు పెడతామని మల్టీ నేషనల్ కంపెనీలు వస్తున్నాయని.. ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామంటే పెట్టుబడిదారులు భయపడరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ తెచ్చిన మెట్రోనే ముందుకు సాగిందని మంత్రి తెలిపారు. తాము ఎన్ని కిలోమీటర్లు తెచ్చామో అన్ని కిలోమీటర్లు మాత్రమే మెట్రో వచ్చిందని చెప్పారు. మెట్రోను విస్తరిద్దామంటే అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. పెరిగిన జనాభాకి అనుగుణంగా మెట్రో విస్తరించకూడదా అని ప్రశ్నించారు. మాజీ మంత్రి హరీశ్ రావు పగటి కలలు కంటున్నారని విమర్శించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలా? వద్దా? హరీశ్ రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ, పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయిందని.. అయినా ఆ పార్టీ నేతల బుద్ధి మారడం లేదని వ్యాఖ్యానించారు. నగరాన్ని విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోందని మంత్రి తెలిపారు. ప్రజల అవసరాలను తీర్చడానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. ఇతర నగరాల అభివృద్ధిపై అధ్యయనం చేశామన్నారు. రాబోయే తరాలకు ఉపయోగపడే కార్యాచరణ చేపట్టాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడానికే బీఆర్ఎస్ ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని అడ్డుకోవాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని మంత్రి ఆరోపించారు. ఓటమితో ఎదురైన నిరాశ నుంచి ఇప్పటికీ బయటకి రాలేకపోతున్నారన్నారు. బుల్లెట్ ట్రైన్ తెస్తామంటే.. ఎందుకని బీఆర్ఎస్ నేతలు అడ్డుపడుతున్నారని ఫైర్ అయ్యారు. తెలంగాణ యువతకు మంచి భవిష్యత్తు ఇవ్వొద్దా అని అన్నారు. స్వార్థ రాజకీయాలే తమకి ముఖ్యమని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు విరుచుకుపట్టారు.

## గోదావరి పుష్కరాలకు రూ.1000 కోట్లు. తొలి విడతగా రూ.300 కోట్ల మంజూరు.

- విద్యార్థుల సంక్షేమానికి సర్కార్ పెద్దపీట-ఇకపై ప్రభుత్వ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజన పథకం-ఉదయం పూట హెల్తీ అల్పాహారం,పాలు పంపిణీ:రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు



**హైదరాబాద్, మే, 23 (సూర్యసేన ప్రతినిధి):** గోదావరి పుష్కరాల కోసం రూ. 1,000 కోట్లు కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమావేశమైన మంత్రివర్గం సంబంధిత పనుల కోసం నిధుల కేటాయింపునకు ఆమోదం తెలిపింది. తొలి విడతగా రూ. 300 కోట్ల మంజూరుకు పచ్చజెండా ఊపింది. కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారుఈ సమావేశంలో విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. ప్రభుత్వ పాఠశాలలకే పరిమితమైన మధ్యాహ్న భోజన పథకాన్ని, ఇకపై ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనూ (ఇంటర్మీడియట్ విద్యార్థులకు) అమలు చేసేందుకు కేబినెట్ పచ్చజెండా ఊపింది. మధ్యాహ్న భోజనంతో పాటు విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలనే సంకల్పంతో మరో అద్భుతమైన నిర్ణయాన్ని తీసుకున్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలతో పాటు జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ప్రతిరోజూ ఉదయం వేళల్లో హెల్తీ బ్రేక్ఫాస్ట్ (అల్పాహారం), అలాగే పాల పంపిణీ చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు ఈ నిర్ణయం ఎంతో మేలు చేకూర్చనుంది. మధ్యాహ్న భోజనం, ఉదయం అల్పాహారం వంటి సదుపాయాల వల్ల డ్రాపౌట్స్ (మధ్యలోనే చదువు ఆపేయడం) తగ్గి, హాజరు శాతం మరింత పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ కేబినెట్ భేటీలో విద్యా రంగానికి సంబంధించిన మరికొన్ని కీలక అంశాలపై కూడా చర్చలు కొనసాగుతున్నాయి..

## రాబోయే కాలంలో
# ఏ శక్తి భారత్‌ను ఆపలేదు..
### రాజ్‌నాథ్ సింగ్



**షిర్డి మే, 23 (సూర్యసేన ప్రతినిధి):** ఒకప్పుడు ఆయుధాలు దిగుమతి చేసుకునే దశలో ఉన్న ఇండియా రాబోయే 25–30 ఏళ్లలో అతిపెద్ద ఆయుధాల సరఫరాదారుగా నిలవనుందని, దీనిని ఏ శక్తీ అడ్డుకోలేదని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్న నివారంనాడు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రక్షణ ఉత్పత్తులల్లో ప్రైవేటు రంగం పాత్రను 50 శాతానికి తీసుకు వెళ్లడమే తమ లక్ష్యమని చెప్పారు. రక్షణరంగానికి కేవలం నట్లు, బోల్టుల సరఫరాదారుగానే ప్రైవేటు రంగం మిగిలిపోవడం లేదన్నారు. అత్యాధునిక ఆయుధాల వ్యవస్థలో కీలక తయారీదారుగా ఉండనుందని చెప్పారు. ప్రభుత్వ విజన్, ప్రైవేట్ సెక్టార్ వినూత్న ఆవిష్కరణల సమన్వయంతో దేశం కొత్త శిఖరాలను అధిరోహిస్తుందని రాజ్‌నాథ్ సింగ్ ధీమా వ్యక్తం చేశారు. 'అందరం కలిసికట్టుగా పనిచేసి భారత్‌ను మందుగుండు సామాగ్రి తయారీ, ఆటోమేషన్ హబ్‌గా రూపొందిద్దాం' అని అన్నారు.

## తెలంగాణలో వడదెబ్బతో 16 మంది మృతి..
# నిరంతరం అప్రమత్తంగా ఉండాలి
### కలెక్టర్లకు మంత్రి పొంగులేటి అత్యవసర ఆదేశాలు




**హైదరాబాద్, మే, 23 (సూర్యసేన ప్రతినిధి):** రాష్ట్రంలో ఎండల తీవ్రత దృష్ట్యా అధికార యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా తక్షణ చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. వచ్చే మూడు రోజుల్లో వడగాల్పుల ప్రభావం మరింత పెరగనుందని ఐఎండీ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచిం చారు. రాష్ట్రంలో రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, తీవ్ర వడగాల్పుల పరిస్థితుల నేపథ్యంలో మంత్రి శనివారం సచివాలయంలో ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా హీట్ వేవ్ పరిస్థితులపై జిల్లాల వారీగా నివేదికలను పరిశీలించి, ప్రజల ప్రాణ రక్షణకు అత్యంత ప్రాధాన్యతతో పనిచేయాలని అధికార యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో జిల్లాల కలెక్టర్ల నివేదిక ప్రకారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నలుగురు, వరంగల్ అర్బన్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో ముగ్గురు చొప్పున జోగులాంబ గద్వాల్, రంగారెడ్డి, సూర్యాపేట జిల్లాల్లో ఒక్కరు చొప్పున ఏడు జిల్లాల్లో 16 మంది వడదెబ్బతో మృతి చెందారని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై మంత్రి స్పందిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు వడదెబ్బ మృతు కుటుంబాలకు నాలుగు లక్షల రూపాయిల చొప్పున నష్ట పరిహారం ఇవ్వాలని ఇందుకు సంబంధించిన ప్రక్రియను త్వరిత గతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఎండల తీవ్రత అసాధారణ స్థాయికి చేరుకుంటోంది. తీవ్రస్థాయి ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వడగాల్పుల తీవ్రత మరింత పెరిగింది. ఇలాంటి సమయంలో ప్రభుత్వ యంత్రాంగం మరింత అప్రమత్తంగా ఉండాలని ప్రజల ప్రాణాల రక్షణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికీ తావుండకూడదని స్పష్టం చేశారు.

## వికసిత భారత్ లక్ష్యంలో యువతదే
# కీలక పాత్ర: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**హైదరాబాద్, మే, 23 (సూర్యసేన ప్రతినిధి):** దేశవ్యాప్తంగా 47 ప్రాంతాల్లో జరిగిన రోజ్‌గార్ మేళాలో 51 వేల మందికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. శనివారం నాడు బోయిగూడలోని రైల్ కళారంగ్‌లో జరిగిన 19వ రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈరోజు 220 మంది కొత్తగా ఉద్యోగాల్లో చేరుతున్నారన్నారు. 2022లో దీపావళి రోజున మొదలైన రోజ్‌గార్ మేళా ద్వారా ఇప్పటివరకు 12.5 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించామని వెల్లడించారు. ఇది కేవలం ఉద్యోగాల కార్యక్రమం కాదని, యువత భవిష్యత్తు కోసం మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన పెద్ద మిషన్ అని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేట్ కంపెనీల్లో కూడా కోట్ల సంఖ్యలో ఉద్యోగాలు వస్తున్నాయని అన్నారు. స్టార్టప్స్, యూనికార్న్ వల్ల యువత ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి వచ్చిందని కేంద్రమంత్రి అన్నారు.

## ఇకపై గ్రీన్‌కార్డు
# నిబంధనలు కఠినతరం..



**వాషింగ్టన్,మే 23:**అమెరికాలో శాశ్వత నివాస హక్కు (గ్రీన్‌కార్డు) పొందాలనుకునే తాత్కాలిక వలసదారులకు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం షాక్ ఇచ్చింది. ఇకపై గ్రీన్‌కార్డు దరఖాస్తుల ప్రక్రియ కోసం వలసదారులు తమ స్వదేశానికి వెళ్లాల్సి ఉంటుందని అమెరికా పౌరసత్వ, వలస సేవల సంస్థ స్పష్టం చేసింది. అయితే, ఈ కఠిన నిబంధనల నుంచి తాజాగా కొన్ని కీలక మినహాయింపులను కూడా ప్రకటించింది.

# త్యాగం సేవ దేశభక్తి సంగమమే సంఘ్...






**రంగారెడ్డి, మే 23 (సూర్య సేన)** : రాష్ట్రీయ స్వయంసేవక సంఘ( ఆర్ఎస్ఎస్ ) గత 100 సంవత్సరాలుగా దేశం కోసం ధర్మం కోసం నిస్వార్ధంగా సేవ చేస్తూ స్వామి వివేకానందుడు ఆశించిన యువశక్తిని తయారు చేస్తోందని పంచ పరివర్తన ద్వారా హిందూ సమాజంలో తామంతా ఒక్కటేనన్న భావనను కలిగిస్తూ దేశాన్ని ముందుకు నడిపిస్తుందని ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంతంలో శుక్రవారం నిర్వహించిన సంఘ శిక్ష వర్గ ( సామాన్య) సార్వ జెన్కోత్సవంలో వక్తలు కొనియాడారు. నాదర్గుల్ లో ఉన్న విద్యా భారతి విజ్ఞాన కేంద్రంలో జరిగిన సార్వజనికోత్సవం సంఘటనకు భారతీయతకు ప్రతిబింబమైన శిక్షార్ధుల దేశభక్తిని ప్రతిభ పాటవాలకు వేదిక అయింది. సార్వజనిపోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న లోహియా గ్రూప్ అధినేత కన్నయ్య లాల్ లోహియా ప్రసంగిస్తూ ఆర్ఎస్ఎస్ సారధ్యంలో రాష్ట్ర చేతనకు నడుము బిగించిన స్వయం సేవకుల ముఖాలలో ఆ చైతన్యాన్ని తాను చూస్తున్నానని ప్రశంసించారు. స్వాతంత్ర ఉద్యమ కాలంలో దేశ విభజన సమయంలోను జాతికి స్వయం సేవకులు అండగా నిలిచారని విపత్తుల వేల ప్రజలకు తోడుగా నిలిచి ఆకలి తీర్చడంతో పాటు ఔషధాలు అందించి అంతిమ సంస్కారాలు సైతం చేసిన సందర్భాలను తాను కళ్ళారా చూశానని కేవలం దేశభక్తి గలవారు మాత్రమే ఇలా చేయగలరని అన్నారు.

సంఘ్ లో ఏమి నేర్పిన అవన్నీ దేశం కోసమే తప్ప వ్యక్తిగతం కాదు అన్నారు .తాము వ్యాపారం చేస్తున్నప్పటికీ అది కేవలం లాభాల కోసం కాదని దేశ వికాసం కూడా అందులో భాగమై ఉందని కన్నయ్య లాల్ పేర్కొన్నారు. పేదరిక నిర్మూలన విద్యా వికాసం గో సేవలకు వ్యాపారం రంగం ఉపయోగపడాలని తాను నమ్ముతానని నర నారాయణ సేవ అని ఆర్ఎస్ఎస్ అదే చేస్తుందని తన మనోగదాన్ని వెల్లడించారు. ఈ శిక్షావర్గంలో శిక్షణ పొందిన వారంతా భావితరాలకు స్ఫూర్తినిచ్చేలా నిలుస్తారని తాను ఆకాంక్షిస్తున్నట్లు వెల్లడించారు ముఖ్యముగా పాల్గొన్న ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత సహకార్యవాహ ఎర్ర నర్సింగ్ మాట్లాడుతూ నూరేళ్ల సంఘ ప్రస్తానాన్ని ప్రస్తావించారు. సంఘ వ్యవస్థాపకులు డాక్టర్ హెగ్డే వర్ పుట్టకతోనే దేశభక్తులని కలకత్తాలో విప్లవ సంస్థ అనుశీలన సమితిలోనూ ఆ తర్వాత నాటి కాంగ్రెస్ పార్టీలోనూ దేశం కోసం బాధ్యతలను భుజానికి ఎత్తుకొని స్వాతంత్రం కోసం విప్లవ యోధులు సమరయోధులతో కలిసి పని చేసిన పరిస్థితులను వివరించారు.

సువిశాలమైన సంపద భరితమైన మన భారతదేశం కేవలం గొప్పెదు మంది చేతుల్లో బంధీ కావడాన్ని డాక్టర్ తరచుగా ప్రశ్నించుకుంటూ చివరికి హిందూ సంఘటన ఇందుకు సరైన నిర్ణయం అని నమ్మి 1925లో కేవలం ఐదుగురు ఆరుగురితో సంఘను ప్రారంభించారని ఎన్నో పరిహాసాలునిరుత్సాహపూరితమైన మాటలు ఎదురైనప్పటికీ లెక్క చేయక ముందుకు నడిపించారని నర్సింగ్ వివరించారు. సంఘ్ పై మూడుసార్లు నిషేధం విధించినప్పటికీ దృఢమైన సంకల్పంతో వాటిని దాటి ముందుకు రావడమే గాక చైనా యుద్ధం జరిగినప్పుడు స్వయం సేవకులు త్యాగనిరుతిని నాటి ప్రధాని నెహ్రూ కొనియాడి 1963 లో రిపబ్లిక్ డే కవాతుకు ఆహ్వానించిన సంఘటనలను గుర్తు చేసుకున్నారు. అలాగే ఎమర్జెన్సీ నాటి నిషేధం సంఘ కార్యకర్తలు ఎదుర్కొన్న సవాళ్లు కృతనిచయం 1992 లో రామాలయ ఉద్యమ సమయంలో చోటు చేసుకున్న మరో నిషేధం దానిని సైతం అధిగమించిన వైనాన్ని నర్సింగ్ తెలిపారు. ఇలాంటి పరిస్థితులలోనైనా సంఘ్ దేశం కోసం కట్టుబడి ఉందంటూ విద్య, వైద్యం సహాయ ప్రకృతి వైపరీత్యాలు ప్రమాద ఘటనల వేళ్ళ పరిస్థితులను ఎదురు ఇంచి సేవలను అందించడమే కాక ఈ క్రమంలో క్రైస్తవులు, ముస్లింలు సైతం స్వయంసేవకులను ప్రశంసించిన ఘటనలు ఎన్నో ఉన్నాయని ఉదాహరించారు. సంఘ్ ద్వారా దాదాపు లక్ష 30 వేలకు పైగా సేవకులు కొనసాగుతున్నారని అన్నారు. మాయమాటలు చెప్పి మతం మార్చే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని పిలుపునిస్తూ అప్రమత్తంగా ఉండాలి అన్నారు. పంచ పరివర్తన ద్వారా హిందూ సమాజంలో తామంతా ఒక్కటేనన్న భావనను కలిగిస్తూ దేశాన్ని సంఘం ముందుకు నడిపిస్తుందని పేర్కొంటూ మన దేశాన్ని వ్యాపారం ద్వారా నియంత్రించాలని భావించే గ్లోబల్ మార్కెట్ శక్తుల నియంత్రించాలని భావించే గ్లోబల్ మార్కెట్ శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్వదేశీకి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వాలని నర్సింగ్ పిలుపునిచ్చారు. సంఘంలోని నిత్య శాఖ శక్తి కేంద్రంగా వ్యక్తి నిర్మాణం వ్యవస్థగా సంస్కార నిలయంగా యువతను ఉందని తెలిపారు.

త్రేతా యుగంలో యజ్ఞస్థలం శక్తి కేంద్రంగా ఉండేదని నేడు సంఘ స్థానం అటువంటి సామాజిక శక్తి కేంద్రంగా ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర సంఖ్యలకు డాక్టర్ వామన్ తెలంగాణ ప్రాంత సంఘచాలకు శ్రీ బర్ల సుందర్ రెడ్డి వర్గస్వర అధికారి సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు. మే 7వ తేదీ నుంచి 22వ తేదీ వరకు జరిగిన సంఘ శిక్ష వర్గ లో మొత్తం 260 మంది శిక్షార్ధులు పాల్గొన్నారు. 15వ తేదీన 94 కుటుంబాలతో మాతృహస్థ భోజన కార్యక్రమం విశేషంగా జరిగిందని నిర్వాహకులు తెలిపారు. జిల్లా విభాగ ప్రాంత క్షేత్ర అఖిలభారత స్థాయి అధికారులు శిక్షార్ధులకు శిక్షణ ఇచ్చినట్లు వివరించారు. సార్వజనికోత్సవంలో భాగంగా రక్షణ నియంత్రణ సమాజ హితం లక్ష్యంగా నేర్పి స్వయం సహాయకులు ప్రదర్శించిన పదసంచాలను పదవిన్యాసం దండ వ్యాయామం నీ యుద్ధ ద్వంద యుద్ధం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది ఘోష్వాగ్య ప్రదర్శన శాఖలోని ఆటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# జీవన నైపుణ్యాలతోనే విజయవంతమైన భవిష్యత్




**- పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేసవి శిబిరంలో ప్రత్యేక తరగతులు**

**నేరేడుచర్ల ప్రతినిధి మే 23 (సూర్యసేన)** : పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేసవి శిక్షణా శిబిరంలో శనివారం జీవన నైపుణ్యాలు, విలువలతో కూడిన విద్యపై విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బట్టు మధు మాట్లాడుతూ జీవితంలో ఎదురయ్యే సవాళ్లు, ఒత్తిళ్లను సానుకూల దృక్పథంతో సమర్ధవంతంగా ఎదుర్కొని విజయం సాధించేందుకు జీవన నైపుణ్యాలు ఎంతో అవసరమని అన్నారు. వ్యక్తిగత ఎదుగుదలతో పాటు వృత్తిపరమైన విజయానికి కూడా ఇవి దోహదపడతాయని పేర్కొన్నారు. కేవలం పుస్తక జ్ఞానాన్ని అందించడం మాత్రమే కాకుండా విద్యార్థుల్లో నైతికత, మానవతా విలువలు, క్రమశిక్షణ పెంపొందించే సమగ్ర బోధననే విలువలతో కూడిన విద్యగా పేర్కొన్నారు. ఈ రెండు విధానాలు విద్యార్థులను ఉత్తమ పౌరులుగా, మంచి వ్యక్తిత్వం కలిగిన వారిగా తీర్చిదిద్దుతాయని తెలిపారు. అనంతరం తమ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నేరేడుచర్ల లయన్స్ క్లబ్ సభ్యులు, ప్రముఖ న్యాయవాది చిత్రం విశ్వనాథ్, ఆయన సతీమణి ఉదయ్ శ్రీ సమ్మర్ శిబిరానికి అధిక సంఖ్యలో హాజరవుతున్న విద్యార్థులను అభినందించారు. క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి తాపాన్ని తగ్గించేందుకు మజ్జిగ, పెరుగన్నం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఇంజమూరి శ్రావణి, లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి షేక్ యూసుఫ్, సభ్యులు బసవ కోటేశ్వరరావు, బాలు మహేంద్ర, దొంతగాని వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు బి. బికోజి, ఎం. బాలు, పీడీ ఎం. యాదగిరి, సరస్వతి, సరిత తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ నిర్వీర్యానికి కేంద్రం కుట్ర

**- కార్మికులకు కనీస వసతులూ కల్పించడం లేదు**

**- తెలంగాణ వ్యవసాయక కార్మిక సంఘం నేతలు**



**నేరేడుచర్ల ప్రతినిధి, మే 23 (సూర్య సేన)** : ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని తెలంగాణ వ్యవసాయక కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు ఆరోపించారు. నేరేడుచర్ల మండలం ఫతేపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించిన ఆయన కార్మికులతో మాట్లాడారు. పని ప్రదేశాల్లో కార్మికులకు కనీస వసతులు కూడా కల్పించడం లేదని, తాగునీరు, గుడారాలు, వైద్య పరికరాలు, పనిముట్లు వంటి చట్టబద్ధ సదుపాయాలు అధికారులు అందించడం లేదని విమర్శించారు. అధికారులు నామమాత్రంగా వ్యవహరిస్తూ కాలం గడుపుతున్నారని మండిపడ్డారు. ఉపాధి హామీ పథకంలో మహిళల భాగస్వామ్యం అధికంగా ఉందని, వారికి వచ్చే కూలి డబ్బులు పిల్లల చదువులు, పౌష్టికాహారం కోసం వినియోగిస్తున్నారని తెలిపారు. ఈ పథకం గ్రామీణ కుటుంబాల జీవన ప్రమాణాల మెరుగుదలకు దోహదపడిందని, దేశ ఆర్థికాభివృద్ధికీ తోడ్పడిందని ఆర్థిక నిపుణులు పేర్కొన్నారని చెప్పారు.

గత ఇరవై సంవత్సరాల్లో ఉపాధి హామీ చట్టం గ్రామీణ పేదలకు ఎంతో మేలు చేసిందని, ఈ పథకం లేకపోతే లక్షలాది మంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. పేదల పొట్ట కొట్టే విధంగా కాకుండా ప్రభుత్వం పథకాన్ని మరింత బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం తొంభై శాతం నిధులు కేంద్ర ప్రభుత్వం, పది శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంటుందని తెలిపారు. కార్మికులకు అరవై శాతం, సామగ్రికి నలభై శాతం నిధులు ఖర్చు చేయాలని చట్టం స్పష్టంగా పేర్కొంటోందన్నారు. వేసవి కాలంలో ఉపాధి కూలీలకు గుడారాలు, తాగునీరు, మజ్జిగ, ప్రథమ చికిత్స సదుపాయాలు కల్పించాలని, వంద రోజుల పని పూర్తి చేసిన కూలీలకు పనిముట్లు ఇవ్వాలని, మార్చి నుంచి మే వరకు చేసిన పనులకు అదనపు వేసవి భత్యం చెల్లించాలని కోరారు. పని కోరిన పదిహేను రోజుల్లో పని ఇవ్వకపోతే నిరుద్యోగ భృతి చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గ్రామీణ పేదలకు ఉపయోగపడేలా రూపొందించిన ఈ చట్టాన్ని అధికారులు సమర్ధంగా అమలు చేయాలని, జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పనుల నిర్వహణను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చిలకరాజు శ్రీను, కొమర్రాజు వెంకట్, పలికే భరత్, దోమకొండ మనోజ్, పార్ధనభోయిన వెంకటమ్మ, సావిత్రమ్మ, సుష్మ, చిత్రం, సోమిరెడ్డి, నర్సిరెడ్డి, నాగమణి, రవి, రంగారెడ్డి, జగన్, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రైతన్నలకు తప్పని అమ్మకం తిప్పలు



**- భారతీయ కిసాన్ సంఘటన జాతీయ ప్రధాన కార్యదర్శి యర్రం వెంకటరెడ్డి.**

**రంగారెడ్డి, మే 23 (సూర్య సేన)** : దేశంలో అత్యధిక ప్రజానీకానికి ప్రధాన ఉపాధి ఆదాయ వనరు వ్యవసాయమే అని జనాభాలో సగానికి పైగా కుటుంబాలు నేటి కి సాగు పైనే ఆధారపడి జీవిస్తున్నాయని ఒకప్పుడు వ్యవసాయం అంటే కేవలం పంట పండించడం వరకే పరిమితం అనుకునేవారు కానీ ఈ రోజుల్లో పంట పండించడం ఒక ఎత్తైతే దాన్ని కాపాడుకునే మార్కెట్కు తీసుకువెళ్లి తగిన ధరకు అమ్ముకోవడం అంతకంటే పెద్ద యుద్ధంలా మారిందని కిసాన్ సంఘటన జాతీయ ప్రధాన కార్యదర్శియర్రం వెంకటరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం నాడు పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేస్తూ దేశంలో ముఖ్యంగా మన రాష్ట్రంలో క్రమంగా సాగు విస్తీర్ణం పెరుగుతున్నప్పటికీ అదే నిష్పత్తిలో రైతుల సమస్యలు రెట్టింపు అవుతున్నాయని అన్నారు .వ్యవసాయ రంగంలో విత్తనాలు వేసేటప్పుడు నుండి పంట చేతికి వచ్చేవరకు రైతులు అనేక సవాళ్లుఎదుర్కొంటున్నారని అయితే గత కొన్నిసంవత్సరాలుగా పంట అమ్మకాలలో రైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం అని అన్నారు. గ్రామాలలో పండిన పంట నిల్వ చేయడం కోసం ప్రభుత్వాలు సరైన స్థలాలు సేకరించకపోవడం ఒకవేళ సేకరించిన రైతు లందరి పంట పట్టేంత స్థలం లేకపోవడం తీవ్రమైన సమస్యగా మారిందని ఎంతో కష్టపడి నిలువ చేసుకున్న పంటను మార్కెట్కు తరలించడానికి కనీసం గోనే సంచులు కూడా సకాలంలో అందకపోవడం వ్యవస్థ వైఫల్యానికి అర్థం పడుతుందని అన్నారు. దీనికి తోడు రవాణా ఖర్చులు భారం కావడంతో రైతు మరింత కృంగిపోతున్నాడని మరోవైపు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరిచిన అక్కడ సరుకు కొనడానికి అధికారులు రకరకాల నిబంధనలు పెడుతూ ఉంటారని పంటలో తేమశాతం ఎక్కువగా ఉంది అనే నెపంతో రోజుల తరబడి రైతులను వీధుల్లోనే వేచి చూసేలా చేస్తున్నారని కొన్ని ప్రాంతాలలో క్వింటాలకు ఎన్ని కిలోల తరుగు అంటూ రైతు శ్రమను దోచుకుంటున్నారని ఒకవేళ ఆ నిరీక్షణలో అకాల వర్షం పడి పంట తడిస్తేకనీసం సగం ధర కూడా కొనే నాధుడు కనబడడం లేదని అన్నారు. దేశ జనాభా కు అన్నం పెట్టే వ్యవసాయరంగం ఈ సంక్షోభం నుంచి బయట పడాలి అంటే కేవలం సబ్సిడీలు ఇస్తే సరిపోదని పంట పండిన తర్వాత రైతుకు అవసరమైన కోల్డ్ స్టోరేజీలు గోదాంలో వంటి మౌలిక వసతులు కల్పించినప్పుడే రైతుకు నిజమైన న్యాయం జరుగుతుందని పంట అమ్ముకోవడానికి రైతులకు అన్ని విధాలా సహకరించి మద్దతు ధరతో పాటు కొనుగోలను కూడా సజావుగా పారదర్శకంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఎంతైనా ఉంది అన్నారు.

# నమ్మకమే మనిషికి అసలైన ఊపిరి...

మనిషి జీవితం నమ్మకం
పునాదుల మీద సాగుతుంది
వ్యక్తుల మధ్య ఉత్పత్తి దారుల
మధ్య ఉన్న నమ్మకమే వ్యాపార
అభివృద్ధికి ఊతంగా నిలుస్తుంది

నమ్మకం వమ్మైతే జీవితం
సమస్యల సుడి గుండమై
ఆర్ధాంతంగానే ముగిసిపోతుంది

దంపతుల మధ్య నమ్మకమే
సంసార రథాన్ని నడిపిస్తుంది
వ్యక్తుల మధ్య కోరికల
ఏకీకరణ నమ్మకానికి
దారి చూపుతుంది

ఇంటికి పునాది ఎంత ముఖ్యమో
బంధానికి నమ్మకం అంతే ముఖ్యం
గుండెల్లో నిజాయితీ లేకపోతే
మనుషుల మధ్య మమకారం
మిగలదు ఆర్ధత అంతరిస్తుంది

నమ్మకం కోల్పోయిన మనిషి
జీవితం అనుమానపు ముళ్ళ
బాటలో సాగే పయనం లాంటిది
నరకానికి ప్రతి రూపమైవేధిస్తుంది

నమ్మకమే మనిషికి
నిజమైన ఊపిరి
నాణ్యతతో చేసే పనులతోనే
నిజమైన వెలుగు వస్తుంది

నమ్మకం నాణ్యత లేని
జీవితం వృదా భరితం
ఆందోళనలకు నిలయం

మాట ఇస్తే తప్పని వ్యక్తిత్వం
నమ్మకానికి నిలువెత్తు రూపం
మాటల్లో చూపే మోసాలు కాదు
చేతుల్లో చూపే నమ్మకమే
నిన్ను సమాజంలో స్ఫూర్తిగా
నిలుపుతుంది

ఊపిరి లేనిదే మనిషి బతుకడు
ఉనికి లేనిదే గుర్తింపు రాదు
నమ్మకం నాణ్యతతోడుంటే
నీ కీర్తి ఎప్పటికీ చెడిపోదు

నమ్మకం అనే వృక్షాన్ని పెంచుదాం
మోసం కుట్రలు లేని వికసిత
భారత్ లక్ష్య సాధనకు
అంకితమై భారత కీర్తి
ప్రతిష్ఠలు పెంచుదాం



నేదునూరి కనకయ్య అధ్యక్షులు తెలంగాణ ఎడ్యుకేషన్ ఫోరం కాలమిస్ట్ రచయిత కరీంనగర్ 9440245771

# శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి క్షేత్రంలో రూ.99.55 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**- రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి**

**యాదాద్రి భువనగిరి, మే 23 (సూర్య సేన)** : యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి క్షేత్రంలో రూ.99.55 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న ఆలయ అనుబంధ అభివృద్ధి పనులకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి శనివారం శంకుస్థాపన చేశారు. రూ.43.79,కోట్లతో వేద పాఠశాలకు ,రూ.9.86 కోట్లతో కొండపై స్వామివారి నిత్య కల్యాణ మండపం నిర్మాణానికి , రూ.1.41 కోట్లతో వైకుంఠ ద్వారం నుంచి కొండపైకి వెళ్లే మెట్ల మార్గానికి పై కప్పు నిర్మాణానికి , రూ.1.34 కోట్లతో రథశాల వైపు మాడవీధులకు మెట్ల నిర్మాణానికి రూ.43.12 కోట్లతో దీక్షాపరుల సదనం నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ముందుగా కామ కోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి పర్యవేక్షణలో వేదమంత్రాల మధ్య వేద పాఠశాలకు భూమి పూజ నిర్వహించారు. అనంతరం ఆలయానికి సంబంధించిన అనుబంధ పనులకు రాష్ట్ర ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేశారు. 15 ఎకరాల విస్తీర్ణంలో 1,40,000 చదరపు అడుగులలో మూడు దశలలో వేద పాఠశాలను నిర్మిస్తున్నారు. మొదటిది దశలో వేద పాఠశాల నిర్మాణం చేపట్టనున్నారు. 500 మంది వేద విద్యార్థులకు విద్యానభ్యసించే అవకాశం కలుగుతుంది. వేద పాఠశాలలో విద్యార్థులకు ఆకామడేషన్ తో పాటు, నివాస భవనాలు, డైనింగ్ హాల్ నిర్మాణం కూడా చేపడుతున్నారు. అంతేకాక పక్కనే యజ్ఞశాల, యాగశాలల నిర్మిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర



శాసన మండలి చైర్మన్ గుట్ట సుఖేందర్ రెడ్డి,రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ, ఉమ్మడి నల్గొండ జిల్లా ఇన్చార్జి మంత్రి ,ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, వేముల వీరేశం, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎం ఎల్ ఏ కుంభం అనిల్ కుమార్ రెడ్డి , దేవాదాయ శాఖ సెక్రటరీ శైలజ రామయ్యర్ దేవాదాయ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ధార్మిక సలహాదారు, రాష్ట్ర దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు ఉన్నారు.

# మృతదేహం లభించిన ఘటన స్థలం పరిశీలించిన ఎస్పీ.....

- హంతకులను పట్టుకోవడానికి 5 ప్రత్యేక పోలీసు బృందాలు ఏర్పాటు చేశాం.
- త్వరితగతిన హంతకులను కఠిన శిక్షలు పడేలా కృషి చేస్తాం.
- పిడి యాక్ట్ పెట్టే జైలుకు పంపిస్తాం, బెయిల్ లభించకుండా చేస్తాం.
- జిల్లా ఎస్పీ నరసింహ ఐపిఎస్.





**సూర్యాపేట క్రైమ్, మే 23 (సూర్య సేన) :** హత్యకు గురైన ఏర్కారం గ్రామానికి చెందిన మధు మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురి నందు ఎస్పి నరసింహ ఐపిఎస్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పి నరసింహ ఐపిఎస్ మృతుని బంధువులతో మాట్లాడినారు. హంతకులను త్వరగా పట్టుకుంటాం కేసును అన్ని కోణాల్లో పటిష్టంగా దర్యాప్తు చేసి నిందితులకు కఠిన శిక్షలు పడేలా పోలీసు శాఖ కృషి చేస్తుందని బంధువులకు ఎస్పి హామీ ఇచ్చారు. అంతరం మీడియాతో మాట్లాడారు.

సూర్యాపేట జిల్లా సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధి ఏర్కారం గ్రామ శివారులో రోడ్డు పక్కన కల్వర్టు క్రింద గోనె బస్తాలో శవం ఉన్నదన్న సమాచారం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకునే మృతదేహాన్ని బయటికి తీశారు. గోన సంచిలో దొరికిన మృతి దేహం ఏల్కారం గ్రామానికి చెందిన చింతలపాటి మధు గా గుర్తించి బంధువులను పిలిపించి నిర్ధారించడం జరిగినది ఎస్పి నరసింహ తెలిపినారు. కాగా చింతలపాటి మధు శుక్రవారం రోజున ఉదయం 11 గంటలకు ఇంట్లో నుండి వెళ్ళాడని ఆచూకీ తెలియడం లేదని సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్ నందు అతని భార్య ఫిర్యాదు చేసింది మొదటగా ఈ ఫిర్యాదు పై మిస్సింగ్ కేస్ నమోదు చేసి, హత్య కేసుగా మార్పు చేయడం జరిగింది ఈ కేసును సూర్యాపేట పట్టణ ఇన్స్పెక్టర్ దర్యాప్తు చేస్తున్నారు డి.ఎస్.పి ప్రసన్నకుమార్ పర్యవేక్షిస్తున్నారు, నిందితులను పట్టుకోవడం కోసం 5 ప్రత్యేక పోలీస్ బృందాలు ఏర్పాటు చేశాం, నిందితులను పట్టుకుని కఠిన శిక్షలు పడేలా త్వరితగతిన దర్యాప్తు చేస్తాం అన్నారు. నిందితులపై పీడి యాక్ట్ పెట్టి బెయిల్ దొరకకుండా జైలులోనే ఉండేలా కృషి చేస్తామని అన్నారు. సంఘటనపై టెక్నికల్ ఆధారాలు సాక్షుల ఆధారాలు బలంగా నమోదు చేస్తామని అన్నారు. చట్టవుల్లంఘన చర్యలకు పాల్పడుతూ భౌతిక దాడులు చేస్తూ హత్యలకు పాల్పడితే చట్టపరంగా కఠిన శిక్షలు అమలైతాయని పోలీసు అత్యంత వేగంగా కేసులు దర్యాప్తు చేస్తుందని తెలిపారు. జిల్లా పరిధిలో గతంలో జరిగిన హత్య కేసులలో నిందితులకు శిక్ష పడిన విషయాన్ని గుర్తు చేశారు. కేసు పట్టిష్టంగా దర్యాప్తు చేస్తున్నామని నిందితులను త్వరగా పట్టుకుని వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. అనంతరం మృతదేహం లభించిన సంఘటన స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు.

# అంతరాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్...

- ఇద్దరు నిందితులు అరెస్ట్ వీరిలో ఒకరు మైనర్ బాలుడు
- నిందితులను కేవలం 24 గంటలలో పట్టుకున్న నల్గొండ వన్ టౌన్, రూరల్ పోలీసులు
- వీరి వద్ద నుండి 2.20 లక్షల నగదు, ఒక ద్విచక్ర వాహనము, ఒక సెల్ ఫోన్, పాస్ బుక్ మరియు దృష్టి మరలించే వస్తువులు స్వాధీనం
- డిఎస్పీ కె.శివరాం రెడ్డి





**నల్గొండ క్రైమ్, మే 23 (సూర్య సేన) :** బ్యాంకుల వద్ద ప్రజల దృష్టి మళ్లించి దొంగతనాలకు పాల్పడుతున్న దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు నల్గొండ డి.ఎస్.పి కే శివరామిరెడ్డి పేర్కొన్నారు. కేసు వివరాలను శనివారం ఆయన వెల్లడించారు. జిల్లాలో దొంగతనాలను పూర్తిగా అరికట్టాలనే లక్ష్యంతో జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ ప్రజల భాగస్వామ్యముతో పోలీసులకు ఆదేశాలిస్తూ నిరంతర నిఘా మరియు గస్తీ ఏర్పాటు చేయడము జరిగినది. అలాగే ప్రస్తుతం జరుగుతున్న వివిద రకాల దొంగతనాల పట్ల ఎప్పటికప్పుడు వివిద మద్యమాల ద్వారా అవగాహన కల్పించడం జరిగినది. ఈ నెల 19వ తారీకు నల్గొండ 1 టౌన్ పట్టణ పరిది లో క్లాక్ టవర్ సమీపములో గల యూనియన్ బ్యాంక్ వద్ద ఒక రైతు గాదె లింగయ్య ఆర్/శీ తిప్పర్తి తన వరి ధాన్యం అమ్మిన తరువాత వచ్చిన డబ్బులు రూ. 1,50,000/- లు నగదు ను బ్యాంకు నుండి డ్రా చేసుకొని కవర్లో పెట్టుకొని తన మోటార్ సైకల్ ట్యాంక్ కవర్లో పెట్టి తన గ్రామానికి వెళ్లడానికి తన ద్విచక్ర వాహనము తీస్తుండగా, కొంత మంది వ్యక్తులు వేరొక మోటార్ సైకల్ ను అడ్డం పెట్టి , తన దృష్టి మరల్చి (అటెన్షన్ డైవర్షన్ చేసి), టాంక్ కవర్ లో పెట్టిన నగదును ఎత్తుకొని పారిపోయినారు అని ధరఖాస్తుదారుడి ఫిర్యాదు మేరకు నల్గొండ 1 టౌన్ పోలీసు స్టేషన్ లో కేసు నమోదు చేసి విచారణ చేపట్టడము జరిగినది.

ఈ క్రమములో వెంటనే జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ ఐపీఎస్., ఆదేశానుసారము నల్గొండ సబ్ డివిజనల్ డి.ఎస్.పి కె. శివరాం

రెడ్డి ఆధ్వరములో నల్గొండ 1 టౌన్ సి.ఐ. రాజ శేఖర్ రెడ్డి మూడు బృందాలుగా ఏర్పడి, నేరస్తుల సీసీటీవీ ఫూటేజ్ , నేరస్తుల ఫోటోలు , వాహనాల వివరాలను గుర్తించి నేరస్తుల గురించి వెతుకుచుండగా, ఇట్టి నేరస్తులు తేదీ 21.05.2026 రోజున నక్రేకల్ పట్టణము పరిది లో ఒక రైతు దగ్గర రూ. 1,40,000/- ల ను ఎస్బిఐ బ్యాంక్ వద్ద దృష్టి మరల్చి దొంగతనము చేసి పారిపోతుండగా, అదే రోజు సాయంత్రము సుమారు 4 గంటల సమయములో సీఐ రాజా శేఖర్ రెడ్డి, ఎస్సై సైదులు, ఎస్సై సైదాబాబు మరియు సిబ్బంది కలిసి వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా, అనుమానాస్పదముగా హెచ్ ఎఫ్ డీలక్స్ వాహనం పై పారిపోతున్న ఇద్దరినీ పట్టుబడి చేసి విచారించగ వారు చేసిన నేరాలు ఒప్పుకొని వివరాలు తెలియజేశారు. పేర్లు

**ఏ-1) రాహుల్ (పరారీలో ఉన్నాడు)**

ఏ-2) కేశవ తేజ దొక్వల తండ్రి తేజు ఏ కృష్ణప్ప వ. 20 సం. లు కులము దొక్వల వృత్తి లేబర్ నివాసము బీజాపూర్ నాకా, దూసరి గహి, శివ మందిర్ దగ్గర , సోలాపూర్, మహారాష్ట్ర స్టేట్ .

3) జె సి ఎల్) మైనర్ బాలుడు 13 సం.లు.

పై ముగ్గురు ఒక పదకము ప్రకారము తక్కువ రోజులలో ఎక్కువగా, సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యముతో బ్యాంకు ల దగ్గర అమాయకులను మాయ మాటలతో బురిడి కొట్టించి, వారి దృష్టి మరల్చే విదముగా చర్యలు చేసి వారి వద్ద నుండి డబ్బులు కొట్టేస్తూ పారిపోతు తిరుగుచున్నామని, మక్తల్, మరికల్, 1 టౌన్ నల్గొండ, ఖమ్మం త్రీ టౌన్, నక్రేకల్ పోలీసు స్టేషన్ ల పరిది లో దొంగతనాలు చేసినామని ఒప్పుకోలు చేసినారు. వారి నుండి నల్గొండ 1 టౌన్, నక్రేకల్ లలో దొంగతనం చేసిన రూ. 2,20,000/- నగదు ను దొంగతనాలకు వాడే మోటార్ సైకల్ హెచ్ఎఫ్ డీలక్స్ , ఒక వివో సెల్ ఫోన్, బ్యాంక్ పాస్ బుక్ లు మరియు దృష్టి మరల్చడానికి వాడే సామాగ్రి లను స్వాదీనము చేసుకొని జైలుకు పంపనైనది.

**- నల్గొండ సబ్ డివిజన్ ప్రజలకు సూచన:**

ఈ ముఠా సభ్యులు ఎక్కువగా బ్యాంకుల లోపల, వెలుపల రద్దీగా ఉండే సమయాల్లో నిఘా పెడతారు. ఎవరైనా పెద్ద మొత్తంలో డబ్బులు డ్రా చేస్తుంటే వారిని గమనించి వెంబడిస్తారు. వారు బ్యాంకు బయటకు రాగానే.. వేరొక మోటార్ సైకల్ ను అడ్డం పెట్టడము, కింద నోట్లు పడవేయడం, బైక్ ఇంజన్ ఆయిల్ కారుతుందని చెప్పడం, లేదా బట్టలపై మురికి, దురద వచ్చే పౌడర్ చల్లడం వంటి ట్రిక్స్ ఉపయోగించి బాధితుడి దృష్టి మళ్ళిస్తారు. వీరి పట్ల అప్రమతముగా ఉండాలి. బ్యాంకు నుండి నగదును విత్డ్రా చేసినప్పుడు మరియు జమ చేసే సమయములో అప్రమతముగా ఉండాలి, అవసరమైతే తోడుగా ఎవరినైనా తీసుకు వెళ్ళాలి. ఎవరైనా అనుమానస్థులు బ్యాంకు ముందు గాని, లోపల గాని తిరుగుచున్నట్లైతే వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి. ఇట్టి కేసులో ప్రతిభ కనబరిచి, డి.ఎస్.పి శివరాం రెడ్డి పర్యవేక్షణలో 24 గంటలలోపు చాకచక్యముగా నేరస్తులను పట్టుబడి చేసి అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన సీఐ రాజ శేఖర్ రెడ్డి, ఎస్సై సైదులు, సైదాబాబు మరియు సిబ్బంది రబ్బాని, రాజు, శంకర్, అజ్మత్, అంజయ్య, కిరణ్ మరియు ఆంజనేయులు తదితరులను జిల్లా ఎస్పి అభినందించారు.

# తరంగిణి నవల ఆవిష్కరణ.....



**రంగారెడ్డి, మే 23 (సూర్య సేన) :** సౌత్ అండ్ పార్క్ కు చెందిన వై రామకృష్ణారావు రచించిన తరంగిణి అనే నవలను వంశీ ఆర్ట్స్ థియేటర్స్, వంశీ రామరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నవలను వై. రామకృష్ణారావు కె.వి రమణాచారి కి అంకితం ఇచ్చారు.

శ్రీకృష్ణదేవరాయ ఆంధ్ర భాష నిలయంలో జరిగిన కార్యక్రమాల్లో కార్యక్రమానికి ముందు, తిరుమల బ్యాంకు మేనేజర్ మేడిపల్లి వి ఎస్ కుమార్ ఆలపించిన ""కానరాద కైలాస నివాస అనే పాట " ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది ఇంకా ఈ కార్యక్రమంలో తెలుగు యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ డాక్టర్ నిత్యానందరావు యోభారతి సాహితీ సంస్థ అధ్యక్షులు సుధామ విహారి సాహితీ కిరణ్ సంస్థల అధ్యక్షులు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# మధు హత్య ముమ్మాటికి కాంగ్రెస్ గుండాలదే...






**- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి**

**సూర్యాపేట, మే 23 (సూర్య సేన) :** కాంగ్రెస్ గుండాల చేతిలో హత్యకు గురైన బీఆర్ఎస్ నాయకుడు, మాజీ సర్పంచ్ చింతలపాటి మధు మృతదేహానికి మాజీ మంత్రి సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి శనివారం జనరల్ ఆసుపత్రిలో నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి మాట్లాడారు. కాంగ్రెస్ గుండాల




హత్యలను తీవ్రంగా ఖండిస్తున్నా మన్నారు. ఈ హత్యలో పోలీసుల భాగస్వామ్యం ఉందనే అనుమానం ఉందన్నారు. హత్య రాజకీయాలను ప్రోత్సవించడం సరికాదన్నారు. పూర్వం కక్షలకు నిలయంగా ఉమ్మడి నల్లగొండ జిల్లా, కాంగ్రెస్ లోనే అంతర్గత విభేదాలు తోటి వందలాది హత్యలు చేసుకోవడమే కాక ఆనాడు ఎన్నికలొస్తే ఎన్ని హత్యలు జరుగుతాయన్న దారుణమైన పరిస్థితి ఉండేనన్నారు. కెసిఆర్ నాయకత్వంలో శాంతిభద్రతలను పూర్తిగా అదుపులో ఉంచిమన్నారు. పోలీసులను కూడా పూర్తిగా స్వేచ్ఛాయిత వాతావరణంలో పని చేసుకునే వీలు కల్పించామన్నారు. కాంగ్రెస్ పార్టీకి అధికారం వచ్చి రెండున్నరేళ్లుగా ఎన్నో అరాచకాలు చూస్తున్నామని, కాంగ్రెస్ గుండాలు, రౌడీల చేతుల్లోనే పోలీస్ స్టేషన్ నడుస్తున్నాయని ఆరోపించారు.

సూర్యాపేటలోనూ పోలీసులు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని, బీఆర్ఎస్ పార్టీ నాయకులను స్టేషన్లకు పిలిపించి మరీ కాంగ్రెస్ గుండాల ముందు నిలబెట్టి అవమాన పరుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనేక సందర్భాలలో పోలీసు అధికారుల దృష్టికి తీసుకుపోయినప్పటికీ వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. గతంలోనూ ఇదే కాంగ్రెస్ గుండాలు బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ ఒంటెద్దు వెంకన్న ను దారుణంగా హత్య చేశారని, పార్టీ శ్రేణులకు సంయమనం పాటించాలని చెప్పమన్నారు.ఆ సాక్షులను భయపెట్టే ప్రయత్నం చేయడమే కాకుండా సడన్ గా పీపీ ని మార్చడం దుర్మార్గమైన చర్య అన్నారు. కేసును బలహీనం చేయడం కోసమే పీపీ ని మార్చారని ఆరోపించారు. మధు హత్యకు కాంగ్రెస్ నాయకులు, పోలీసు అధికారులే బాద్యులన్నారు. ఈ కేసు ఇన్వెస్టిగేషన్ ఎలా జరుగుతుందో.. రిమాండ్ రిపోర్ట్ లో ఏం చూపిస్తారో చూస్తామన్నారు. పోలీస్ అధికారులు కాంగ్రెస్ పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తే తర్వాతైనా కేసుల్ని తిరగతోడుతామని హెచ్చరించారు. విచారణలో తప్పుచేస్తే ఐజీ స్థాయి అధికారులను కూడా పదేళ్ల తర్వాత జైళ్లకు పంపిన ఘటనలు ఎన్నో చూశామన్నారు. నిజమైన నిందితులెవరో వారిని గుర్తించి సరైన శిక్ష పడే విధంగా పోలీసు అధికారులు పనిచేయాలని, తప్పు దోవ పట్టించేందుకు ప్రయత్నించిన ఏ అధికారినైనా వదిలిపెట్టమన్నారు. మధు కుటుంబానికి అండగా నిలబడతామని, ఇద్దరు ఆడపిల్లలకు చదువుల బాధ్యత, కుటుంబ పోషణ విషయంలో బిఆర్ఎస్ పార్టీగా బాధ్యత తీసుకుంటామన్నారు.

ఒంటెద్దు వెంకన్న కుటుంబానికి ఏ విధంగా అండగా నిలిచామో మధు కుటుంబానికి కూడా అదేవిదంగా అండగా నిలబడతామన్నారు. ఆయన వెంట బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ బిఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

# మురుగు... నివాసాల మధ్య పరుగు.



**- బస్తీల్లో పారిశుద్ధ్య సమస్యలు ఇబ్బంది పడుతున్న ప్రజలు**
**- చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి**

**రంగారెడ్డి, మే 23 (సూర్య సేన) :** బడంగ్ పేట సర్కిల్ పరిధిలో ప్రశాంతి హిల్స్ డివిజన్ లెనిన్ నగర్ బస్తీలో ఇళ్ల మధ్య నిలిచిన మురుగుతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. పారిశుద్ధ్య సమస్య చాలా ఎత్తునసర్కిల్ యంత్రాంగం ఎన్ని చర్యలు తీసుకున్న బస్తీల్లో మాత్రం తరచుగా మురుగు సమస్యతో తిప్పలు తప్పడం లేదని స్థానికులు వాపోతున్నారు. మురుగునీరు రోడ్లపై ఇళ్ల మధ్య నిలిచి ఉండడంతో దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు తదితర జీవాలకు ఆవాసాలుగా మారుతున్నాయని బస్తీ వాసులు తెలిపారు. ఇరుకు రహదారుల పై రోడ్లపై మురుగుతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారుతుందని స్థానికులు చెబుతున్నారు.

**- పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలి**

బస్తీలలో తరచూ మరుగు సమస్యపై సర్కిల్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని డ్రైనేజీ మ్యాన్హోలం శుభ్రం చేయడం ద్వారా నమన్యకు చెక్ పెట్టవచ్చునని బస్తీవానులు అభిప్రాయపడుతున్నారు. సమస్య ఉన్నప్పుడు సిబ్బంది వెంటనే స్పందించేలా ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# భూముల విలువల సవరణ ప్రక్రియ పారదర్శకంగా పూర్తి చేయాలి...




నల్గొండ, మే 23 (సూర్య సేన): భూముల మార్కెట్ విలువల సవరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ బి చంద్రశేఖర్ అధికారులను తెలిపారు. శనివారం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి రాష్ట్రవ్యాప్తంగా భూముల మార్కెట్ విలువల సవరణ ప్రక్రియను వేగవంతం చేయడంపై హైదరాబాద్ నుండి భూ పరిపాలన ప్రధాన కమిషనర్ డి.ఎస్. లోకేష్ కుమార్, అన్ని జిల్లాల కలెక్టర్లు,అదనపు కలెక్టర్లు రెవెన్యూ లతో ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్లో ఉన్న డిమాండ్ను బట్టి ఎక్కడా ప్రజలకు ఇబ్బంది కలగకుండా, అదే సమయంలో ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఈ సవరణలు ఉంటాయని పేర్కొన్నారు. అంతకు ముందు భూ పరిపాలన ప్రధాన కమిషనర్ డి.ఎస్. లోకేష్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో



ప్రస్తుతం ఉన్నా మార్కెట్ డిమాండ్, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా మే 28 నాటికి మార్కెట్ విలువల సవరణ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ మార్కెట్ ధరలను నిశితంగా పరిశీలించి, ఎలాంటి వ్యత్యాసాలు లేకుండా శాస్త్రీయంగా ఈ విలువలను ఖరారు చేయాలని సూచించారు. రెవెన్యూ రిజిస్ట్రేషన్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత గడువులోగా నివేదికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. వీడియో. కాన్ఫరెన్స్లో రెవెన్యూ అదనపు కలెక్టర్ జే శ్రీనివాస్ పాల్గొన్నారు

## సంపాదకీయం

ఆదివారం, మే 24, 2026

# మోడీ గోల్డన్ స్ట్రోక్..

పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న సంక్షోభం భారత ఆర్థిక వ్యవస్థను ఊపిరి ఆడనివ్వకుండా చేస్తోంది. పెరుగుతున్న నిర్మాణ వ్యయం, ముడిసరుకు కొరత, విదేశీ మారక నిల్వలపై పడుతున్న భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం అత్యంత కఠినమైన నిర్ణయాల వైపు అడుగులు వేస్తోంది. మరో వైపు కేంద్రం బంగారం విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. బంగారం, వెండి, ప్లాటినం దిగుమతుల మీద సుంకం రెట్టింపు చేసింది. ఇప్పటిదాకా అది ఐదు శాతం మాత్రమే ఉండేది. ఇప్పుడు ఏకంగా 10 శాతానికి పెరిగిపోయింది. ఇది మంగళవారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి వచ్చింది. ఆభరణాల తయారీకి వాడే వస్తువులు.. ఇతర లోహాలు.. పారిశ్రామిక దిగుమతులకు కూడా ఇది వర్తిస్తుంది. దీంతో దేశవ్యాప్తంగా బంగారం, వెండి ధరలు పెరిగే అవకాశం కనిపిస్తోంది.. ఇప్పటికే బంగారం ధర (24 క్యారెట్లు) 1,40,000 మించి ట్రేడ్ అవుతోంది. కేంద్రం తీసుకున్న నిర్ణయంతో ఆ ధర మరింత పెరిగే అవకాశం ఉంది.బంగారం దిగుమతులు పెరుగుతుండడం కేంద్ర ప్రభుత్వాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. ధరలు పెరుగుతున్నప్పటికీ చాలామంది బంగారం మీద ఇన్వెస్ట్ చేస్తున్నారు. మార్కెట్ నిపుణులు కూడా బంగారం మీద ఇన్వెస్ట్ చేయాలని సూచనల మీద సూచనలు చేస్తున్న నేపథ్యంలో.. చాలామంది ఇతర రంగాలను పక్కనపెట్టి.. కేవలం బంగారం మీద మాత్రమే ఇన్వెస్ట్ చేస్తున్న నేపథ్యంలో.. ఇతర రంగాలలో కొనుగోళ్లు పూర్తిగా తగ్గిపోయాయి. దీంతో ఆయా రంగాలలో ఆర్థికంగా అభివృద్ధి అంతగా సాగడం లేదు. అందువల్లే కేంద్రం ఈ నిర్ణయం తీసుకొని ఉంటుందని తెలుస్తోంది. బంగారం కొనుగోళ్లు ఏడాదిపాటు తగ్గిపోతే మన దేశానికి సంబంధించిన విదేశీ మారకద్రవ్య నిల్వలు పెరుగుతాయని కేంద్రం అంచనా వేస్తోంది.కేవలం బంగారం, ఇతర ఖరీదైన లోహాలు మాత్రమే కాదు.. ఆహార పదార్థాల ధరలు కూడా విపరీతంగా పెరుగుతున్నాయి. దేశంలో ఏప్రిల్ నెలకు సంబంధించి రిటైల్ ద్రవ్యోల్బణం ఏకంగా నాలుగు నెలల గరిష్టానికి చేరుకుంది. నాలుగు నెలల క్రితం ఇది 3.48 శాతంగా ఉండేది. జనవరిలో 2.74 శాతంగా ఉండేది. దీనికి ప్రధాన కారణం ఆహార ధరల పెరుగుదలే. వరుసగా ఆలు.. ఉల్లి.. టమాటా ధరలు క్రాష్ అయ్యాయి. మిగతా ఉత్పత్తుల ధరలు పెరిగాయి. దీంతో నాలుగు నెలల్లో ఆహార ద్రవ్యోల్బణం గడిచిన నాలుగు నెలల్లో 2.13 శాతం నుంచి 4.2 శాతం వరకు పెరిగింది. జ్యువెలరీ, ఫర్నిచర్, ఎలక్ట్రానిక్స్ వంటి వాటిపై ఏప్రిల్ లో ద్రవ్యోల్బణం 53.61 శాతానికి చేరుకుంది. దేశవ్యాప్తంగా అన్ని ప్రధాన నిర్మాణ పనులను రెండేళ్ల పాటు నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వానికి నీతి ఆయోగ్ సిఫార్సు చేయడం ఇప్పుడు సంచలనంగా మారింది.నీతి ఆయోగ్ సిఫార్సుల ప్రకారం.. కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సెంట్రల్ సెక్రటేరియట్ పునర్నిర్మాణ పనులను కూడా ప్రస్తుతానికి వాయిదా వేయనున్నారు. నిర్మల్ భవన్, ఉద్యోగ్ భవన్ వంటి భవనాల కూల్చివేత, కొత్త నిర్మాణాలను వాయిదా జాబితాలో చేర్చారు. యుద్ధం కారణంగా స్టీల్, సిమెంట్ వంటి ముడిసరుకుల సరఫరాలో అంతరాయం కలగడం, దిగుమతి ఖర్చులు పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.ప్రస్తుత ఆర్థిక అనిశ్చితిని దృష్టిలో ఉంచుకుని ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు కీలక విన్నపం చేశారు. విదేశీ వస్తువుల వాడకాన్ని తగ్గించి, స్వదేశీ వనరులపై ఆధారపడాలని కోరారు. ముఖ్యంగా ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు పాఠశాలలకు ఆన్‌లైన్ తరగతులను నిర్వహించాలని సూచించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. కోవిడ్ కంటే భయంకరమైన సంక్షోభం ఇదని ప్రధాని వ్యాఖ్యానించడం తీవ్రతకు అద్దం పడుతోంది. నీతి ఆయోగ్ ప్రతిపాదనలు, యుద్ధ ప్రభావంతో భారత స్టాక్ మార్కెట్లు ఒక్కసారిగా కుప్పకూలాయి. సెన్సెక్స్ ఏకంగా ఇన్వెస్టర్ల సంపద ఆవిరైపోయింది. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు మండుతుండటంతో భారత రూపాయి విలువ ఆల్ టైమ్ లో 95.28 వద్ద ట్రేడ్ అవుతోంది. ఇది సామాన్యులపై నిత్యావసర వస్తువుల ధరల భారం పెంచే ప్రమాదం ఉంది.మరోవైపు, ప్రభుత్వ నిర్ణయాలపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నాయి. ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపిస్తున్నాయి. నిర్మాణ రంగం ఆగిపోతే లక్షలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోతారని, ఆన్‌లైన్ క్లాసుల వల్ల విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుందని హెచ్చరిస్తున్నాయి. ఒక దేశం వద్ద ఉన్న విదేశీ మారకద్రవ్యం, బంగారం, ఇంటర్నేషనల్ మానిటరింగ్ ఫండ్ వద్ద ఆదేశానికి సంబంధించిన కరెన్సీ హక్కులు, ఐఎంఎఫ్ లో సభ్యత్వం తీసుకున్నప్పుడు.. ఆ దేశం రిజర్వ్ చేసిన సొమ్ములో 25 శాతం. ఇలా ఈ నాలుగింటిని కలిపి విదేశీ మారక ద్రవ్య నిల్వలు అని పిలుస్తుంటారు.. ఇవి ఒక దేశ ఆర్థిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంటాయి. వీటిని అంచనా వేసి ఆ దేశం ఆర్థికంగా ఏ స్థాయిలో ఉందో అన్ని పనులు అంచనా వేస్తారు..మూడీస్, ఎస్ అండ్ పీ, ఫిచ్ వంటి సంస్థలు ఫారెక్స్ రిజర్వ్ అధికంగా ఉన్న దేశాలకు అద్భుతమైన రేటింగ్ ఇస్తాయి. ఈ రేటింగ్ గనక అధికంగా ఉంటే.. ఆదేశాలకు తక్కువ వడ్డీకి అప్పులు లభిస్తుంటాయి. ఉదాహరణకు మనం లోన్ కోసం బ్యాంకు దగ్గరికి వెళ్తే.. మన సిబిల్ స్కోర్ చూస్తుంటారు. అది బాగుంటే బ్యాంక్ అధికారులు లోన్ వెంటనే మంజూరు చేస్తుంటారు. ఇదే విధానాన్ని దేశాలకు కూడా అప్పులు ఇచ్చే సంస్థ పాటిస్తుంటాయి.

సూర్యసేన

దినపత్రికలో
అన్ని రకాల ప్రకటనలు
అడ్వర్టైజ్మెంట్స్ మరియు
వార్తల కోసం

సంప్రదించండి: 9951241048



## విద్యార్థి దశ నుంచే చురుకైన నేత..

# కాంగ్రెస్‌ను ఆదుకున్న వీడీ సతీశన్


తిరువనంతపురం: కేరళ కాంగ్రెస్ పార్టీలో ఉన్న చురుకైన వ్యక్తుల్లో వీడీ సతీశన్ ఒకరు. ఆ రాష్ట్ర రాజకీయాల్లో ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉన్నది. వాస్తవాలు చెప్పడంలో.. వాదనల్లో క్లారిటీ.. అసెంబ్లీలో ప్రత్యర్థులను ఢీకొట్టడంలో సతీశన్ సమర్థుడు. అనేక మంది కాంగ్రెస్ నేతలు ఆయన్ను దాటుకుని వెళ్లినా ఆయన మాత్రం తన అవకాశం కోసం ఎదురుచూశారు. తాజాగా ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో యూడీఎఫ్ కూటమికి 102 సీట్లు వచ్చాయి. అయితే కాంగ్రెస్ విక్టరీలో కీలక పాత్ర పోషించిన సతీశన్‌కు సీఎం బాధ్యతలను ఆ పార్టీ అధిష్టానం అప్పగించింది.

సతీశన్ వయసు 61 ఏళ్లు. ఆయనేమీ సడెన్‌గా సీఎం కాలేదు. దశాబ్దాలుగా తన స్థానాన్ని రాజకీయాల్లో సుస్థిరం చేసుకున్నారు. పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర శ్రమతో ఆయన రాణించారు. ఎర్నాకుళం జిల్లా నెట్టూరులో ఆయన మే 31, 1964లో జన్మించారు. ఆయన తండ్రి పేరు వదసెరి దమోదర మీనన్. ఆయన ఫారెస్ట్ శాఖ అధికారి. తల్లి పేరు విలాసిని అమ్మ. సతీశన్ న్యాయ విద్యలో పట్టభద్రుడు. రాజకీయాల్లోకి రాకముందే ఆయన అడ్వకేట్ గా చేశారు. విద్యార్థి దశలోనే సతీశన్ రాజకీయాలు చేశారు. తీవరలోని ఎస్‌హెచ్ కాలేజీలో యూనియన్ ఆఫీస్ బియరర్‌గా చేశారు. ఎంజీ యూనివర్సిటీ యూనియన్‌కు చైర్మెన్ అయ్యారు. ఎన్ఎస్‌యూఐలో జాతీయ కార్యదర్శిగా చేశారు. పారవూరు నియోజకవర్గం సతీశన్‌కు కంచుకోట. రెండు దశాబ్దాలుగా ఆయన ఆ స్థానం నుంచి గెలుపొందుతున్నారు. 1996లో తొలిసారి ఆయన ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. ఆ సమయంలో ఆ నియోకవర్గం సీపీఐ పట్టున్న సీటుగా భావించారు. సీపీఐ అభ్యర్థి రాజు చేతిలో వెయ్యి ఓట్లతో ఆయన పరాజయం చవిచూశారు. ఓడినా ఆయన ఆ నియోజకవర్గాన్ని వీడలేదు. పట్టుదలతో తన కేడర్‌ను నిర్మించుకున్నారు. ఇక ఆ తర్వాత పారవూరు ఏకంగా కాంగ్రెస్ సీటుగా మారిపోయింది. 2001, 2006, 2011, 2016, 2021, 2026 ఎన్నికల్లో ఆయన ఆ స్థానం నుంచే ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే కాంగ్రెస్ పార్టీలో ఉన్న అంతర్గత కుమ్ములాటల వల్ల సతీశన్ చాన్నాళ్లు సైలెంట్‌గా ఉండిపోయారు. కేఎస్‌యూ ప్రెసిడెంట్, యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్, కేపీసీసీ ప్రెసిడెంట్ అయ్యే సందర్భాలను అనేక సార్లు ఆయన మిస్సయ్యారు. కేరళ అసెంబ్లీలో పబ్లిక్ అకౌంట్స్ కమిటీ అండ్ ఎస్టిమేట్స్ కమిటీ చైర్మెన్‌గా చేశారు. తమిళనాడుకు ఏఐసీసీ సెక్రటరీ ఇంచార్జిగా చేశారు. కేపీసీసీ వైస్ ప్రెసిడెంట్‌గా అయిదేళ్లు చేశారు. 2016 ఒమన్ చండీ ప్రభుత్వంలో కాంగ్రెస్ పార్టీ విప్‌గా చేశారు. 2021లో యూడీఎఫ్ దారుణంగా ఓడింది. ఆ సమయంలో సీనియర్ నేతలను పక్కనపెట్టి, సతీశన్‌ను ప్రతిపక్ష నేతగా ప్రకటించారు. కేరళ రాజకీయాల్లో ప్రత్యేక పేరును సతీశన్ సంపాదించారు. ఒమన్ చండీ సర్కారు ఉన్న సమయంలో అసెంబ్లీలో సతీశన్ 33 వాయిదా తీర్మానాలను ఇచ్చారు. ఇది కేరళ అసెంబ్లీలో ఓ రికార్డు క్రియేట్ చేసింది. ఫ్యాక్షన్ రాజకీయాలకు భిన్నంగా తన ఎన్నికల ప్రచారాల్లో సమస్యలపై ఫోకస్ పెట్టి ప్రసంగించారు. వాస్తవాలతో ప్రత్యర్థులపై ఆయన దాడి చేసేవారు. యూడీఎఫ్‌లో ఉన్న లుకలుకలను రూపుమాపే ప్రయత్నం చేశారు. బలమైన పినరయి విజయన్ ప్రభుత్వాన్ని ఎదుర్కొనేందుకు సతీశన్ చాలా సమర్థుడిగా ఉన్నట్లు కాంగ్రెస్ నేతలు భావించారు. ప్రతిపక్ష నేతగా యూడీఎఫ్‌కు గట్టి పోటీ ఇచ్చారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో యూడీఎఫ్ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. కేరళలో 20 స్థానాల్లో యూడీఎఫ్ 18 స్థానాలు గెలుచుకున్నది. 2025 లోకల్ బాడీ ఎన్నికల్లో కూటమి విజయంలోనూ సతీశన్ కీలక పాత్ర పోషించారు. తిరక్కకర, పుత్తుపల్లి, నీలాంబుర్ ఉప ఎన్నికల్లో యూడీఎఫ్ విజయం కోసం శ్రమించారు. ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం, సీఎం విజయన్‌ను తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను గట్టిగా ప్రశ్నించారు. కేరళ ప్రతిపక్ష నేతగా సతీశన్ అంచలంచెలుగా ఎదిగారు. పార్టీ పరంగా రాజకీయమైన కఠిన నిర్ణయాలను ఆయనే తీసుకున్నారు. ఎమ్మెల్యే రాహుల్ మామ్‌కూటతిల్ వివాదం సమయంలో సరైన నిర్ణయం తీసుకున్నట్లు సతీశన్‌పై ప్రశంసలు వచ్చాయి. వీడీ సతీశన్‌కు పర్యావరణవేత్తగా కేరళలో గుర్తింపు ఉన్నది. పశ్చిమ కనుమల రక్షణ కోసం ఏర్పాటు అయిన మాధవ్ గాడ్గిల్ కమిటీ నివేదికకు ఆయన మద్దతు ఇచ్చారు. యూడీఎఫ్‌లోనే భిన్న అభిప్రాయాలు ఉన్నా.. ఆయన మాత్రం అక్రమ మైనింగ్, భూ ఆక్రమణ వ్యతిరేకించారు.

2024లో వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడ్డ సమయంలో.. రాష్ట్ర ప్రభుత్వ డిజాస్టర్ మేనేజ్మెంట్ వ్యవస్థను సతీశన్ విమర్శించారు. నియంత్రణ లేని టూరిజం కన్నా.. సుస్థిర అభివృద్ధి ప్రణాళికలు చేపట్టాలని సూచించారు. సతీశన్ కెరీర్‌లో కొన్ని వివాదాలు కూడా ఉన్నాయి. పునర్జని ప్రాజెక్టు కోసం ఆయన విదేశీ నిధులు సేకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. 2018 వరద బాధితల కోసం ఆ నిధులను సేకరించారు. కానీ విజిలెన్స్ రిపోర్టులో ఆయనకు క్లియరెన్స్ దక్కింది. చూరల్‌మాలా ముండక్కై డిజాస్టర్ బాధితుల కోసం సేకరించిన డబ్బును ఎన్నికల ప్రచారం కోసం వాడినట్లు ఆరోపణలు ఉన్నాయి. 2022లో ఆర్ఎస్ఎస్‌తో లింకున్న ఓ కార్యక్రమానికి సతీశన్ హాజరైనట్లు కొన్ని ఫోటోలు రిలీజ్ అయ్యాయి. కానీ కేవలం బుక్ రిలీజ్ కోసం హాజరైనట్లు ఆయన చెప్పారు. ఎర్నాకుళంలో స్టూడెంట్ నేత నుంచి ఆరు సార్లు ఎమ్మెల్యేగా సతీశన్ తన ప్రస్థానం కొనసాగించారు. కేరళ రాజకీయాల్లో తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్నారు. ఎన్నో ఏళ్ల ఎదురుచూపులు, ఎదురుదెబ్బల తర్వాత ఇప్పుడు హైకమాండ్ ఆదేశాలతో సతీశన్ ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు.

# ఎన్నికలపై సర్కార్ మీన మేషాలు!

హైదరాబాద్, : హైదరాబాద్ మహానగర పాలక సంస్థ (జీహెచ్ఎంసీ) పాలకవర్గం పదవీకాలం ముగిసి మూడు నెలలు గడిచిపోయాయి. ఫిబ్రవరి రెండో వారంతోనే బల్దియా కౌన్సిల్ గడువు తీరిపోయింది. ఈలోపు జీహెచ్ఎంసీని రాష్ట్రప్రభుత్వం పరిపాలన సౌల భ్యం కోసం మూడు కార్పొరేషన్లుగా విభజించింది. జీహెచ్ఎంసీతో పాటు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎం సీ), మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ)గా విభజించింది.మూడు కార్పొరేషన్లకూ కమిషనర్లను సైతం నియ మించింది. సౌలభ్యం కోసం మూడు కార్పొరేషన్లు విడిపోయినప్పటికీ, మొత్తంగా చూస్తే ఆ మూడు జీహెచ్ఎంసీలో భాగమే. గతంలో ఉన్న 150 డివిజన్లను, సర్కార్ ఏకంగా 300కు పెంచింది. వాటిని నిష్పత్తి విధానంలో మూడు కార్పొరేషన్లకు పంచింది. రాష్ట్ర జనాభాలో 25% జనాభా ఈ మూడు కార్పొరేషన్ల పరిధిలోనే ఉంటుంది. రాష్ట్రానికి వచ్చే ఆదాయంలో సింహభాగం ఆదాయం ఇక్కడి నుంచే వస్తుంది.ఇంత ప్రతిష్ఠాత్మకమైన చోట్ల బల్దియా ఎన్నికలు ఆలస్యం కావడం విమర్శలకు తావిస్తున్నది. ఇప్పటికిప్పుడు ఎన్నికలకు వెళితే ప్రతికూల ఫలితాలు వస్తాయని కాంగ్రెస్ ప్రభుత్వం భయపడుతున్నదా? లేక ఏదైనా ప్రత్యేక వ్యూహంతోనే తాత్సారం చేస్తోందా? అన్న ప్రశ్నలు ఇప్పుడు తలెత్తుతున్నాయి. ప్రజాప్రతినిధుల పాలన లేకపోవడంతో ప్రస్తు తం డివిజన్లలో ప్రత్యేక అధికారుల పాలన నడుస్తున్నది. వారు సామాన్యుల సమస్యలను, అభివృద్ధి పనులను గాలికొదిలేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.అయినప్పటికీ, రాష్ట్రప్రభుత్వం నుంచి ఎలాంటి కదలిక కనిపించడం లేదు. మూడు కార్పొరేషన్ల విస్తీర్ణం ప్రస్తుతం 2,053 చదరపు కిలోమీటర్ల మేర ఉంది. ఇంత భారీ విస్తీర్ణం ఉన్న నగరంలో ప్రజలు ఎన్నుకున్న పాలకులు (కార్పొరేటర్లు) లేకుండా అభివృద్ధి సాధ్యం కా దని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రోడ్ల మరమ్మతులు, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా వంటి పనులు పాలకుల పర్యవేక్షణ లేక గాడితప్పాయని చెబుతున్నారు. జీహెచ్ఎంసీలో బీఆర్ఎస్‌కు తిరుగు లేని బలంగా ఉన్నదనేది అందరూ ఒప్పుకునేదే. అందుకు ఇక్కడ ఎమ్మెల్యేల సంఖ్యాబలమే అందుకు నిదర్శనం. అర్బన్ ఓటర్ల విషయానికి వస్తే, బీజేపీ వైపే అనుకూలమైన పవనాలు వీస్తున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. మొదటి నుంచీ అర్బన్ ఓటర్లలో బీజేపీకి పట్టు ఉండటం, కోర్ అర్బన్ ఏరియాల్లో బీజేపీకి ఎమ్మెల్యేలు, ఎంపీలూ ఉండటం ఆ పార్టీకి కలిసొచ్చే అంశమని చెప్పవచ్చు.ఎంపీల విషయానికొస్తే అధికార కాంగ్రెస్ పార్టీకి బలం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, జరిగిన కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లోనూ కాంగ్రెస్ విజయకేతనం ఎగరవేసింది. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కే అత్యధిక స్థానాలు దక్కాయిఅయినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు జీహెచ్ఎంసీ ఎన్నికలు నిర్వహించడం లేదనే ప్రశ్న తలెత్తుతున్నది. మూడు పార్టీలకు సమానమైన బలం ఉన్నప్పుడు, సాధారణంగా అధికార పార్టీకి మరింత అనుకూలం ఉంటుంది కనుక.. త్వరగా ఎన్నికలు నిర్వహిస్తే, సానుకూల ఫలితాలే వస్తాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.ప్రస్తుతం నగరంలో ప్రత్యేక అధికారుల పాలనలోనే సాగుతున్నది. స్థానిక సమస్యల పరిష్కారానికి ఎవరిని సంప్రదించాలో తెలియక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులు ఉంటేనే క్షేత్రస్థా యిలో సమస్యలు పరిష్కారం అవుతాయని వారు అభిప్రాయపడుతున్నారు. మూడు కార్పొరేషన్ల పరిధిలో ఎమ్మెల్యేల సంఖ్య 18 నుంచి 27 మందికి పెరిగే అవకా శం ఉంది.అయినప్పటికీ, కార్పొరేటర్లు లేకపోవడంతో పాలన, అభివృద్ధి పనులపై ప్రతికూల ప్రభావం పడుతున్నది. పాత గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 150 డివిజన్లు డీలిమిటేషన్‌తో 243 డివిజన్లయ్యాయి. విలీన మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల పరిధిలో మరో 57 డివిజన్లు ఏర్పాటయ్యాయి. అలా డివిజన్ల సంఖ్య 300కి పెరిగింది.ముంబైలో గతంలో అమలు చేసిన ఎన్నికల వ్యూహా న్ని హైదరాబాద్‌లోనూ అమలు చేసే అవకాశం ఉందని ప్రచారం సాగుతున్నది. బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) పరిధిలో 2017 తర్వాత, ఇటీవల బల్దియా ఎన్నికలు జరిగాయి. సుదీర్ఘకాలం తర్వాత, తాజాగా బల్దియా కౌన్సిల్ కొలువదీరింది. దీంతో ఏళ్లపాటు అక్కడ ప్రత్యేక అధికారుల పాలన సాగింది. ఆ సమయంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు డివిజన్ల విభజన, జనాభా సమతుల్యత వంటి సంస్కరణలు చేపట్టాయి.దీనివల్ల రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే, ఆ పార్టీ రాజకీయపరమైన ప్రయోజనాలు పొందా యి. ఇప్పుడు హైదరాబాద్ విషయంలోనూ కాంగ్రెస్ సర్కారు అదే మార్గంలో వెళ్లే సంకేతాలు కనిపిస్తున్నాయి. డివిజన్ల సంఖ్య పెంచడం, ఇతర సంస్కరణలు చేపట్టడ చూస్తుంటే, అది బీఎంసీ మాడల్‌లో భాగమేనని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ప్రజాప్రతినిధుల పాలన లేకపోవడం పరిణమించింది. ప్రత్యేకాధికారులు సమస్యలను సమర్థంగా పరిష్కరించలేకపోతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే అదనుగా కొం దరు నాయకులు నగరవాసుల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా మేల్కొని ఎన్నికలను త్వరగా నిర్వహించి, పాలనను పట్టాలెక్కించకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయంగా నష్టపోయే ప్రమా దం ఉందని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. నగరవాసుల్లో అసంతృప్తి తీవ్రస్థాయికి చేరుకోకముందే, బల్దియా ఎన్నికల దిశగా అడుగులు వేయాలని సూచిస్తున్నారు.వాస్తవానికి నగరవాసులు తమ సమస్యల పరిష్కారం కోసం స్థానిక ప్రజాప్రతినిధులను సంప్రదిస్తుంటా రు. అసలు.. ప్రజాప్రతినిధులే లేకపోతే, తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలి.. ఏ అధికారిని సంప్రదించాలి.. తమ సమస్యలకు ఎలా పరిష్కారం లభిస్తుందని నగరవాసులు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల నిర్వ హణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెనకడుగు వేయడం వెనుక రాజకీయ లెక్క లు ఉన్నట్లు కనిపిస్తున్నది.డివిజన్ల విభజన, కొత్త ప్రాంతాల కూర్పు వంటి అంశాలను సాకుగా చూపి కాలయాపన చేస్తోందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఓటమి భయంతోనే ప్రభుత్వం ఎన్నికలను వాయిదా వేస్తోందని మండిపడుతున్నాయి. డివిజన్లు పెంచడం, జీహెచ్ఎంసీ పరిధిలోకి కొత్తగా కొన్ని ప్రాంతాలను చేర్చడం, బల్దియాను మూడు కార్పొరేషన్లుగా విభజించడమంతా వ్యూహా త్మక ఆలస్యమేనని ఘంటాపథంగా చెబుతున్నాయి.




# సినీ హీరోలను వాడేసుకుంటున్న ఫ్యాన్

విజయవాడ, : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు చాలా విచిత్రంగా ఉంటాయి. వ్యూహాత్మకంగా కూడా ఉంటాయి. ముఖ్యంగా సోషల్ మీడియా ద్వారా చేసే ప్రయత్నాలు బాగా ఆకట్టుకుంటాయి. ప్రధానంగా సినీ హీరోల అభిమానులను తన వైపునకు తిప్పుకునే ప్రయత్నంలో వైసిపి చేసే రాజకీయం మామూలుగా ఉండదు. ప్రస్తుతం టాలీవుడ్ ప్రముఖ హీరోల అభిమానులను వారికి తెలియకుండానే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ టర్న్ చేసుకోగలదు. అంత గొప్ప వ్యూహం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సొంతం. టిడిపి కూటమికి సినీ గ్లామర్ ఉంది. నందమూరితో పాటు ఇతర సినీ పెద్దల అభిమానం ఉంది. జనసేనకు మెగా కాంపౌండ్ వాల్ నుంచి బలమైన సపోర్ట్ లభిస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి మాత్రం ఆ స్థాయిలో లేదు. అందుకే ప్రముఖ హీరోల అభిమానులను వైసీపీ వైపు తిప్పుకునేందుకు సోషల్ మీడియాలో పెద్ద ప్రయత్నమే చేసింది. ఆ హీరోలంతా జగన్మోహన్ రెడ్డికి అభిమానులు అన్నట్టు సోషల్ మీడియాలో బిల్డప్ ఇస్తోంది.యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ విషయంలో అటువంటి ప్రచారమే చేసింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. ఇప్పటికీ చేస్తూనే ఉంది. ప్రభాస్ పెదనాన్న రెబల్ స్టార్ కృష్ణంరాజు. ఆయన బిజెపిలో ఉండేవారు. బిజెపి నేతగానే చనిపోయారు. ఒకానొక దశలో కృష్ణం రాజు జనసేనలో చేరుతారని అప్పట్లో ప్రచారం నడిచింది. అయితే ఆయన అకాల మృతి చెందారు. ఆ సమయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. కృష్ణంరాజు స్వగ్రామంలో పెద్ద కర్మ నిర్వహించారు. ఆ సమయంలో అయితే రాజశేఖర్ రెడ్డి పై కృష్ణంరాజుకు ఎంతో అభిమానం ఉండేదన్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ చేశారు. సహజంగానే రాజకీయ సినీ రంగాలకు దగ్గర సంబంధాలు ఉంటాయి. అప్పట్లో కృష్ణంరాజును రాజా అని రాజశేఖర్ రెడ్డి సంబోధించేవారని స్వయం గా రెబల్ స్టార్ ప్రకటించారు. దానిని పట్టుకొని యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ తమ వాడే అన్నట్టు సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అయితే దీనిని గుర్తించిన కృష్ణంరాజు భార్య ఏకంగా కూటమికి మద్దతు ప్రకటించడంతోపాటు ప్రచారం చేశారు. అయినా సరే ఇప్పటికీ ప్రభాస్ అభిమానులను వైసీపీ వైపు తిప్పుకోవడానికి ఆ పార్టీ చేయని ప్రయత్నం అంటూ లేదు.మరోవైపు జూనియర్ ఎన్టీఆర్ అభిమానులను సైతం వైసీపీ నిత్యం ఆకర్షిస్తూనే ఉంటుంది. నందమూరి, నారా ఫ్యామిలీలతో జూనియర్ ఎన్టీఆర్ కు గ్యాప్ఉందంటూ ప్రచారంచేయడంలో వైయస్సార్ కాంగ్రెస్ సోషల్ మీడియా ముందుంటుంది. మంత్రి నారా లోకేష్ కోసం జూనియర్ ఎన్టీఆర్ ను పార్టీలో తొక్కేశారు అంటూ ప్రచారం చేయడంలో కూడా వైయస్సార్ కాంగ్రెస్ పాత్ర ఉంది.సినిమాలే ప్రపంచంగా బతుకుతు న్నారు జూనియర్ ఎన్టీఆర్. రాజకీయాల గురించి పట్టించుకునే స్థాయిలో లేరు ఆయన. అయితే అయిన దానికి కానీ దానికి ఫ్యాన్స్ మధ్య విభజన రేఖ గీసి..వారినితమ వైపు తిప్పుకునేపనిలోఉం టుంది వైయస్సార్ కాంగ్రెస్. ఎప్పటికప్పుడు చంద్రబాబుతో పాటు లోకేష్ కు చెక్ పెట్టాలని జూనియర్ ఎన్టీఆర్ పేరును తెరపైకి తీసుకొస్తూ వివాదాలు సృష్టించేందుకు ప్రయత్నాలు చేస్తోంది.అల్లు అర్జున్ విష యంలో అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అతిగా వ్యవహరించింది అని చెప్పవచ్చు. మెగా కాంపౌండ్ వాల్ నుంచి అల్లు అర్జున్ ను వేరుచేసి చూపడంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పాత్ర ఉంది.

# యువత కు నైపుణ్య అభివృద్ధి శిక్షణకు ప్రాధాన్యం...










**నల్గొండ టౌన్, మే 23 (సూర్య సేన) :** యువత స్వయం వారి కాళ్లపై వారు నిలబడేందుకు ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి శిక్షణలకు ప్రాధాన్యత ఇస్తున్నదని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా చేపట్టిన యువజన వారోత్సవంలో యువతకు ప్రభుత్వం విస్తృత అవకాశాలు కల్పించిందని అన్నారు. శనివారం ఉదయాదిత్య భవన్ లో సీఎం కప్ క్రీడలలో విజయం సాధించిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేసి,

జాబ్ మేళాలో ఎంపికైన యువతకు నియమకాపు ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశంలో 25 నుంచి 30 ఏళ్ల మధ్య యువత పెద్ద సంఖ్యలో ఉన్నారని, యువతే దేశానికి గొప్ప వనరు అని అన్నారు. యువత స్వయం సమృద్ధిగా నిలబడేందుకు ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యం పెంచే ఉద్దేశంతో"ఫిట్ తెలంగాణ "కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు.

నల్గొండలో న్యాక్ సెంటర్,సెట్విన్ సెంటర్ ఇందిరా మహిళా శక్తి కేంద్రాలను ఏర్పాటు చేసి యువతకు కెరీర్ మరియు నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు.

వ్యాపారం ప్రారంభించాలనుకునే యువతకు ఎంఎస్ఎంఈ ద్వారా రూ. 1 కోటి నుంచి రూ. 5 కోట్ల వరకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని పేర్కొన్నారు.

యువత సమాజ అవసరాలను అర్థం చేసుకుని నిరంతరం నేర్చుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. ముఖ్యంగా ఫైనాన్స్ డిసిప్లిన్ అవసరమని, ఎంత పొదుపు చేశాం, ఎంత ఖర్చు చేశాం అనే విషయాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా, చాటింగ్ వంటి వాటిపై సమయాన్ని వృథా చేయకుండా లక్ష్యసాధనపై దృష్టి పెట్టాలని సూచించారు. యువత డ్రగ్స్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఎవరైనా మాదకద్రవ్యాల వినియోగంలో ఉన్నట్లు తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పిలుపునిచ్చారు. అనంతరం సీఎం కప్ క్రీడలలో రాష్ట్ర స్థాయిలో తొలి స్థానం సాధించిన హాకీ జట్టును కలెక్టర్ అభినందించారు. అలాగే కిక్ బాక్సింగ్, అథ్లెటిక్స్, వాలీబాల్, ఫుట్‌బాల్ తదితర క్రీడల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్ ,అదనపు ఎస్పీ రమేష్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి అక్బర్ అలీ,కోచ్ శంభు లింగం వివిధ కోచ్ లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# యువజన మరియు క్రీడా వారోత్సవాలు








**- 89 మంది యువత కు నియామక పత్రాలు అందజేత**

**సూర్యాపేట, మే 23 (సూర్య సేన) :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా రాష్ట్ర యువజన మరియు క్రీడల శాఖ వారు తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు గాను మే 01 నుండి మే 12 వరకు రాష్ట్రంలో వివిధ జిల్లాలో జాబ్ మేళా నిర్వహించడం జరిగినది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నిరుద్యోగులకు మే 02 న నల్లగొండ నందు జాబ్ మేళా నిర్వహించడం జరిగినది. ఇట్టి జాబ్ మేళాలో సూర్యాపేట జిల్లాలోని 89 మంది వివిధ కంపెనీలలో ఉద్యోగాలు సాధించడం జరిగినది. ఈ ఉద్యోగ సాధన కార్యక్రమము ద్వారా ఉద్యోగాలు పొందిన వారికి శనివారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయములో నియామక పత్రాలను అందజేయడం జరిగింది. ఉద్యోగం సాధించిన వారందరికి జిల్లా కలెక్టర్ అభినందనలు తెలియజేశారు. మరియు రెండో విడత సీఎం కప్ - 2025 లో చెస్ క్రీడాలో రాష్ట్ర స్థాయిలో మెడల్ సాధించిన ఓరుగంటి అనంత లక్ష్మి ని సన్మానించి రూ. 5 వేలు నగదు పురస్కారం అందజేయడం జరిగిందని సూర్యాపేట జిల్లా యువజన మరియు క్రీడలు, ఇన్చార్జి టూరిజం శాఖ అధికారి బి. వెంకట్ రెడ్డి పేర్కొన్నారు.

# బాధిత కుటుంబానికి రూ.30 వేల ఆర్థిక సాయం



**గరిడేపల్లి ప్రతినిధి, మే 23 (సూర్య సేన) :** పొనుగోడు గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్ అకాల మరణం చెందడం పట్ల 2005-2006 టెన్త్ బ్యాచ్ మిత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో బ్యాచ్ మిత్రులు కలిసి రూ. 30 వేల ఆర్థిక సాయాన్ని శనివారం అందజేశారు.

ఈ సందర్భంగా చామకూరి అంజయ్య మాట్లాడుతూ.. "హుస్సేన్ కుటుంబానికి ఎలాంటి ఆపద వచ్చినా మేమంతా అండగా ఉంటాం. అవసరమైతే ఎప్పుడైనా సంప్రదించండి" అని భరోసా ఇచ్చారు. మిత్రుల సహాయం బాధిత కుటుంబానికి కొంత ఊరటనిచ్చింది. ఈ కార్యక్రమంలో నందిపాటి శ్రీను, పంగ నాగయ్య, మంగ సైదులు, కానుగు గురుస్వామి, బత్తిని విజయ్, బండి నాగయ్య, మద్దిమడుగు అరవింద్, రణపంగు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# పాలిటెక్నిక్ కోర్సులను చేరడానికి అడ్మిషన్ కౌన్సిలింగ్ షెడ్యూల్......

**రంగారెడ్డి, మే 23 (సూర్య సేన) :** సాంకేతిక విద్యాశాఖ, రాష్ట్ర సాంకేతిక విద్య శిక్షణ బోర్డు వారు, 2026 -27 విద్యా సంవత్సరానికి సంబంధించి పాలిటెక్నిక్ కోర్సులలో చేరడానికి షెడ్యూల్ విడుదల చేసినట్లు బడంగ్ పేట మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ శనివారం తెలిపారు. మొదటి విడత కౌన్సిలింగ్ ప్రక్రియ మే 27 నుండి ప్రారంభమవుతుందని,

27న స్లాట్ బుకింగ్ మరియు ఫ్రిజ్ చెల్లింపు ఉంటుందని మే 27 నుండి 31వ తేదీ వరకు ఆన్లైన్లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం స్లాట్ బుక్ చేసుకోవాలని కోరారు మే 29 నుండి జూన్ 1వ తేదీ వరకు స్లాట్ బుక్ చేసుకున్న అభ్యర్థులకు ధ్రువీకరణ పత్రాలు పరిశీలించడం జరుగుతుందని మే 29 నుండి జూన్ 3 వరకు అభ్యర్థులు తమకు నచ్చిన కాలేజీ మరియు కోర్సులను ఎంచుకోవచ్చునని, తాత్కాలిక సీట్ల కేటాయింపు జూన్ 6 లేదా అంతకంటే ముందుగా అభ్యర్థులకు సీట్లను జూన్ 8 నుంచి 9వ తేదీ లోపు ఫీజు చెల్లించి కేటాయించిన కాలేజీలో రిపోర్ట్ జూన్ 9 నుంచి విద్యాసంవత్సరం ప్రారంభమవుతుందని ఆ ప్రకటనలో తెలిపారు.

# మీర్ పేట జ్యువలరీ షాప్ లో దొంగతనం

**రంగారెడ్డి, మే 23 (సూర్య సేన):**

బడంగ్ పేట సర్కిల్ పరిధిలోని మీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ జువెలరీ షాప్ లో దొంగతనం జరిగింది. మీర్ పేట జనప్రియ అయోధ్య నగర్ కాలనీలో ఉన్న శ్రీ గురుదత్త జువెలరీ షాప్ సెక్టర్ తెల్లవారుజామున తలకు క్యాప్ ధరించిన యువకుడు పగలగొట్టి షాప్ లోకి ప్రవేశించాడు. షాపులోనే ఐదు లక్షల విలువగల కిలోనర్రై వెండి వస్తువులను ఎత్తుకు వెళ్లాడు .ఐదు నిమిషాల వ్యవధిలోనే దొంగతన పనిచేసుకొని తిరిగి వెళ్ళిపోయిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయని పక్కన టిఫిన్ సెంటర్ షట్టర్ తీసి ఉండడాన్ని గమనించి షాప్ యజమాని అనంతోజు సురేష్ బాబుకు సమాచారం అందించారు. అతడు వెళ్లి మీర్పేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# నలగండ్లలో ఆకాశాన్నితాకుతున్న భూముల ధరలు

**హైదరాబాద్, మే 23 (సూర్య సేన) :** నలగండ్ల రియల్ ఎస్టేట్ రంగం మధ్య తరగతి అంచానాలు దాటి ఆకాశాన్ని తాకుతోంది. అమ్మకాలు లేక పోయినా ధరలు దిగనంటున్నాయి. ప్రధాన రహదారికి ఆనుకున్న స్థలాలకు డిమాండ్ పీక్స్ కు చేరుకుంది. ఓవైపు గచ్చిబౌలి, మరోవైపు బీహెచ్ఈఎల్, లింగంపల్లి మధ్యలో రియల్ వెలుగులతో ఎగసిపడుతున్న ప్రాంతం నలగండ్ల. ఓ పదేళ్ల క్రితం నలగండ్లలో ఇళ్లు కొనాలి అంటే వామ్మో అంత దూరం ఎందుకులే అనుకునేవాళ్లు. ఇప్పుడు అదే నలగండ్లలో వామ్మో సొంతిల్లు కొనగలమా అంటూ నోరెళ్ల బెట్టే పరిస్థితి వచ్చేంది. అంతలా పదేళ్ల కాలంలో చూస్తూ చూస్తూనే నలగండ్ల రియల్ రంగం ఊహించని స్థాయిలో ఎదిగింది. నలగండ్ల సమీపంలో ముళ్లపొదలు, నిర్మాణుష్య ప్రాంతాలు సైతం బుల్డోజర్లతో తవ్వి ప్రధాన రహదారులుగా మార్చేస్తున్నారు. తల్లిదండ్రులు హైదరాబాద్‌లో ఉంటూ విదేశాలలో వారి పిల్లలు స్థరపడ్డారంటే కచ్చితంగా నలగండ్లలో కనీసం ఓ వందగజాల స్థలం లేదా లగ్జరీ అపార్ట్మెంట్‌లో ఖరీదైన ఫ్లాట్ ఇప్పటికే కొనేసి ఉంటారు. ఒకప్పుడు చేతినిండా బ్లాక్ మనీ ఉన్నవాళ్లు సైతం ఇలా నలగండ్లలో కారుచౌకకు భూములు భారీగా కొనేశారు. ఇప్పుడు అవే భూములు బంగారాన్ని తలదన్నేలా డిమాండ్ పలుకుతున్నాయి.

విశాలమైన రోడ్లు, గ్రీనరీ మధ్యలో కాలనీలతో కాలుష్యానికి దూరంగా ఉన్న నలగండ్ల,రియల్ ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. విదేశాల?లో ఉద్యోగాలు, బ్లాక్ మనీ పెట్టుబడిగా పెట్టేవారికి నల్లగండ్ల అనుకూల ప్రాంతంగా మారింది. నలగండ్లలో స్థలాల రేట్లు ఇలా ఉన్నాయి. ప్రాంతం/ లేఅవుట్ రకం సగటు గజం ధర 100 గజాలల అంచనా ధర వెంచర్ లోపలి ప్లాట్లు లక్ష నుంచి లక్షన్నర కోటి నుంచి కోటిన్నర పెట్టాలి. హుడా లే అవుట్స్ లక్షన్నర పైమాటే కోటిన్నర పైగా పెట్టాలి రోడ్డుకు సమీపంలో ఉన్న ప్లాట్లు రెండు లక్షల పై మాటేరెండు కోట్లు ఖర్చు చేయాలి మెయిన్ రోడ్డుకు ఆనుకొని ప్లాట్ ఉంటే మూడు లక్షలపై మాటే మూడు కోట్లపైగా పెట్టాలి. నలగండ్ల పరిసర ప్రాంతాల్లో గజం భూమి కొనాలంటే అక్షరాల లక్ష పెట్టాల్సిందే. వందగజాలు జాగా మీ సొంతం కావాలంటే కోటికిపైగా చెల్లించుకోవాల్సిందే. అదికూడా వెంచర్ కాస్త లోపలకు ఉన్న ప్లాట్లు మాత్రమే మీకు దక్కుతాయి. అలా కాదని రోడ్డు కాస్త సమీపంలో వంద గజాలు భూమి కొనాలనుకుంటే తక్కువలో తక్కువగా 2కోట్లు పైమాటే. తెల్లాపూర్, గచ్చిబౌలి వంటి ప్రాంతాలు నలగండ్లకు దగ్గరగా ఉండంతో ఐటీ ఉద్యోగులు నలగండ్లపై కన్నేశారు. ట్రాఫిక్ కష్టాల లేకుండా త్వరగా ఆఫీసులకు వెళ్లాంటే నలగండ్ల అనువైన ప్రాంతం కావడంతో గత రెండేళ్ల కాలంలో ఇక్కడ రియల్ భూమ్ పిక్స్‌కు చేరుకుంది. ఇక్కడున్న హుడా లేవుట్‌లో గజం భూమి లక్షలకు పైమాటే అదే రోడ్డుకు సమీపంలో ఉంటే రెట్టింపు ధరలు పలుకుతున్నాయి. గోపనపల్లి పరిసర ప్రాంతాల నుంచి గచ్చిబౌలి వచ్చేవారికి నల్లగండ్ల షార్ట్ కట్‌గా మారింది. గత ఏడాది కాలంగా ఇక్కడ రియల్ రంగం అత్యంత వేగంగా పరుగులు పెడుతోంది. నలగండ్ల రియల్ ఎస్టేట్ రంగం మధ్య తరగతి అంచానాలు దాటి ఆకాశాన్ని తాకుతోంది. అమ్మకాలు అంతలా లేక పోయినా ధరలు మాత్రం కిందికి దిగనంటున్నాయి. సొంత ఇంటి కల సాకారం చేసుకోవాలంటే, అపార్ట్మెంట్ లలో ఫ్లాట్లు కొనండి కానీ, ఇండివీడ్యూవల్ హౌస్ అంటూ కనీసం ఆలోచనలకు కూడా రానివ్వొద్దంటున్నారు స్థానికులు. ప్రధాన రహదారికి ఆనుకున్న స్థలాలకు డిమాండ్ పీక్స్ కు చేరుకుంది. వీటిలో గజం స్థలం 3లక్షలు, వంద గజాలు మూడు కోట్లకుపైగా అమ్మకాలు సాగుతున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. రియల్ ఎస్టేట్ దెబ్బకు నలగండ్ల సమీప ప్రాంతాల్లో ఇంటి అద్దెలు కూడా విపరీతంగా పెరిగిపోయాయి. ఒకప్పుడు మహా అయితే నెలకు 5వేలు అద్దె ఉండే సింగిల్ బెడ్ ఇళ్లు ఇప్పుడు 15వేలు దాటింది. అదే అపార్ట్మెంట్‌లో మంచి ఫ్లాట్‌లో అద్దెకు ఉండాలంటే అర లక్ష నెలకు అద్దెకు చెల్లించాల్సిందే. ఐటీ ఉద్యోగులకు పెట్టుబడి పెట్టేందుకు అత్యంత అనుకూలమైన ప్రాంతం కావడంతో హైదరాబాద్ నగరంలో నలగండ్ల రియల్ భూమ్ తగ్గేదే లే అన్నట్లుగా దూసుకుపోతోంది. నల్లగండ్లకు సమీపంలోనే ప్రధాన కార్యాలయాలు ఉండటంతో ఇక్కడ ఐటీ ఉద్యోగులు సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. సొంత ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాలు ఇలా కనిపిస్తే కొనేద్దాం అనేంతలా ఐటీ ఉద్యోగులు నల్లగండ్లపై ఆశక్తి చూపడంతో నల్లగండ్ల చుట్టు ప్రక్కల ప్రాంతాలు సైతం వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి.

# ఎండల మంట అంతా యూపీలోనే

**లక్నో, మే 23 (సూర్య సేన) :** సరిగ్గా మూడు రోజులక్రితం ఉత్తర ప్రదేశ్ లో 46కు మించిన డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ప్రస్తుత సీజన్ లో ఇదే హైయెస్ట్ రికార్డు అనుకుంటే.. ఇప్పుడు అంతకుమించిన స్థాయిలో టెంపరేచర్ రికార్డు అవుతోంది. భయటికి వెళ్లాలంటేనే భయం కలుగుతోంది. ఒకవేళ బయటికి వెళ్తే క్షేమంగా ఇంటికి వస్తామా అనే ఆందోళన కలుగుతోంది. ఎందుకంటే ఎండలు ఆ స్థాయిలో ఉన్నాయి మరి. ఎండలు ఇలా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు నరకం చూస్తున్నారు. డీ హైడ్రేషన్ వంటి సమస్యలతో బాధపడుతున్నారు. కొన్ని సందర్భాలలో తీవ్రమైన అనారోగ్యానికి కూడా గురవుతున్నారు. దేశవ్యాప్తంగా సగటున 40 డిగ్రీలకు మించిన ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో జనం బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. అంతేకాదు వడగాలులు కూడా తీవ్రంగా వీచాయి. వడదెబ్బ మరణాలు కూడా నమోదయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా టాప్ హీట్ నగరాలు కూడా మనదగ్గర నమోదయ్యాయంటే ఎండ తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. వడగాలుల వల్ల శుక్రవారం మధ్యాహ్నం వరకే 40 డిగ్రీలకు మించి టెంపరేచర్ రికార్డయింది. ఒడిశాలోని బాలన్ గిర్ ప్రాంతంలో ఏకంగా 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. ఎయిర్ క్వాలిటీ అండ్ వెదర్ ట్రాకర్ ఈ విషయాన్ని బయట పెట్టింది. చంద్రాపూర్(మహారాష్ట్ర), ప్రయాగ్ రాజ్(ఉత్తరప్రదేశ్), ఛత్తీస్ గఢ్, బిహార్, తెలంగాణ, హర్యానా, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలలో పలు ప్రాంతాలలో రికార్డు స్థాయిలో టెంపరేచర్ నమోదయింది. టాప్ 50 నగరాలలో సగం ఉత్తర ప్రదేశ్ లోనే ఉన్నాయి. ఇప్పటికే వాయవ్య,



మధ్యభారత్ ప్రాంతంలో వడగాలులు చుక్కలు చూపిస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో రెడ్, ఆరెంజ్ అలర్ట్ లను వాతావరణ శాఖ జారీ చేసింది. మధ్యాహ్నంవరకు వాతావరణ శాఖ విడుదల చేసిన వరల్డ్ హాట్50 నగరాలలో అన్ని కూడా మనదేశంలోనే ఉన్నాయి. వేడి మాత్రమే కాదు, వడగాలుల తీవ్రత మనదగ్గర అధికంగా ఉంది. వాతావరణంలో మార్పులు, కాలుష్యం, పారిశ్రామికకరణ, చెట్లను నరకడం వంటి పరిణామాలు ఎండ వేడిమి పెరగడానికి దోహదం చేస్తున్నాయని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు

ఎండలు ఇలా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు నరకం చూస్తున్నారు. డీ హైడ్రేషన్ వంటి సమస్యలతో బాధపడుతున్నారు. కొన్ని సందర్భాలలో తీవ్రమైన అనారోగ్యానికి కూడా గురవుతున్నారు. దేశవ్యాప్తంగా సగటున 40 డిగ్రీలకు మించిన ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో జనం బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. అంతేకాదు వడగాలులు కూడా తీవ్రంగా వీచాయి.

# మిల్లర్లపై నిబంధనల కత్తి



**హైదరాబాద్,మే 23 (సూర్య సేన) :** ఉరుము ఉరిమి మంగళం మీద పడినట్టుగా ఉంది. తాము నిర్వర్తించాల్సిన బాధ్యతలను సరిగా నిర్వహించకుండా, రాష్ట్రంలోని ప్రైవేటు రైస్ మిల్లర్లపై పడుతుండటంతో.. నిర్దిష్ట సమయంలోగా బియ్యాన్ని అటు ఎఫ్‌సీఐకి, ఇటు సివిల్ సప్లకి సరఫరా చేయలేక, చివరికి డిఫాల్టర్లుగా మిగులుతున్నామని మిల్లర్లు ఆవేదన చెందుతున్నారు. ఇలా డిఫాల్టర్లుగా మారకుండా ఉండేందుకు రైస్ మిల్లర్లు పక్కదారిపట్టేలా ప్రభుత్వమే నిబంధనల పేరుతో తమ భవిష్యత్తుతో ఆటలాడుకుంటుందని వారంటున్నారు. పైగా తాము పాటించని నిబంధనలను బూచిగా చూపెడుతూ, 25 శాతం పెనాల్టీని.. దానికి తోడు గా 12 శాతం వడ్డీని కూడా వసూలుచేస్తూ, తమ నడ్డి విరుస్తున్నట్టు రైస్ మిల్లర్లు గగ్గోలు పెడుతున్నారు. దీనితో వీటన్నింటినీ భరించే శక్తి లేక, అక్రమ మార్గాలను ఎంచుకుంటున్నట్టు మిల్లర్లు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రతి సీజన్‌లోనూ ధాన్యం సరఫరా నుంచే రైస్ మిల్లర్లపై ఒత్తిడి మొదలవుతుందని వారంటున్నారు. నిజానికి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని ప్రభుత్వం సరఫరా చేయాలి. ఆ ధాన్యాన్ని మిల్లింగ్ చేసి నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం బియ్యాన్ని మిల్లర్లు ఇవ్వాలి. బియ్యాన్ని మిల్లర్లు రవాణా చేసేటప్పుడు గోదాముల్లో సరైన స్థలం ఉండాలి. ఈ మూడు అంశాల్లో ప్రభుత్వ అధికారులు, సివిల్‌సప్లై విభాగాలు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే.. రైస్ మిల్లర్లు నిర్దేశించిన ప్రమాణాలమేరకు, నిర్దిష్టమైన సమయంలోగా బియ్యాన్ని అప్పగిస్తారు. అయితే ఈ మూడు అంశాలనుకూడా ప్రభుత్వం తరఫున ఎవరూ సక్రమంగా పాటించడం లేదు. దీనితోనే అసలైన తకరారు మొదలవుతుందని రైస్ మిల్లర్లు అంటున్నారు. × ధాన్యం నాణ్యతతో ఉండటం లేదు. 3 శాతం వరకే ముక్కిన/రంగు మారిన ధాన్యాన్ని ఇవ్వాల్సి ఉండగా.. రాజకీయ ఒత్తిళ్ళ కారణంగా.. ఇది కాస్తా 15శాతం వరకు వెళుతోంది. క్వింటాళు ధాన్యంలో 15 శాతం.. అంతకంటే ఎక్కువగాకూడా ముక్కిన/రంగుమారిన ధాన్యం ఉంటోంది. × సన్నరకం ధాన్యం నుంచి 10 శాతం బ్రోకెన్ శాతంతో 67 శాతం బియ్యాన్ని ఇవ్వడం అసాధ్యమని మిల్లర్లు నెత్తినోరు కొట్టుకుంటున్నారు. టెస్ట్ మిల్లింగ్ చేయమంటున్నారు. కానీ ప్రభుత్వం చేయడం లేదు. × అటు భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కు గానీ, ఇటు సివిల సప్లై సంస్థకు గానీ బియ్యాన్ని సరఫరా చేసే సమయానికి గోదాములు ఖాళీగా ఉండటం లేదు. దీనితో ఆలస్యం అవుతోంది. ప్రభుత్వం విధిస్తున్న నిబంధనలకు విరుద్ధంగా పరిస్థితులు ఉండటంతో.. రైతులు సకాలంలో బియ్యాన్ని సరఫరా చేయలేకపోతున్నారు. కొంత సర్దుబాటు చేసి పంపించిన బియ్యాన్నికూడా గోదాముల్లో ఖాళీలేదని వెనక్కి పంపిస్తుండటంతో.. తిరిగి తిరిగి.. మిల్లర్లకే చుట్టుకుంటోంది. నిర్దేశించిన గడువులోగా బియ్యాన్ని సరఫరా చేయకపోవడంతో.. డిఫాల్టర్లుగా మిగిలిపోతున్నారు. పైగా ఇవ్వాల్సిన బియ్యాన్ని 25 శాతం పెనాల్టీతో.. అదనంగా మరో 12 శాతం వడ్డీతో చెల్లించాలని ప్రభుత్వం నిర్దేశించడంతో.. రైస్ మిల్లర్ల పరిస్థితి పెనంమీది నుంచి పొయ్యిలో పడ్డట్టుగా అవుతోంది. ఉదాహరణకు.. 100 క్వింటాళ్ల బియ్యాన్ని నిర్దేశించిన గడువులోగా ఎఫ్‌సీఐకిగానీ, సివిల్ సప్లకిగానీ సరఫరా చేయకపోతే.. సదరు మిల్లరుపై 25 శాతం పెనాల్టీ విధిస్తున్నారు. అంటే మొత్తం 125 క్వింటాళ్ళ బియ్యం ఇవ్వాలన్నమాట. పైగా దీనికి అదనంగా మరో 12 శాతం వడ్డీ విధిస్తారు. అసలు సరఫరాచేసే ధాన్యం నాణ్యంగా లేకపోవడం, ఏవిధంగా చూసినా.. 67 శాతం రాని బియ్యాన్ని ఇవ్వాలంటున్న అధికారులు.. ఇవ్వకపోతే 25 శాతం పెనాల్టీ, అదనంగా 12 శాతం వడ్డీతో తమ నడ్డి విరుస్తున్నారని రైస్ మిల్లర్లు వాపోతున్నారు.

సుమారు 400 డిఫాల్ట్ రైస్ మిల్లులు..

ఇలాంటి పరిస్థితుల ప్రభావంతోనే.. రాష్ట్రంలో డిఫాల్టర్ రైస్ మిల్లుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతున్నాయని రైస్ మిల్లర్ల సంఘం నాయకులు నెత్తినోరు బాదుకుంటున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో సుమారు 400 వరకు డిఫాల్ట్ అయిన రైస్ మిల్లులు ఉన్నాయని వారంటున్నారు. దీనిపై ఇప్పటికే ప్రభుత్వానికి ఎన్నోసార్లు విజ్ఞప్తి చేసినా.. తమ వైపు ఉన్న ఇబ్బందులు, కష్టాలు, సమస్యలను పట్టించుకున్నపాపాన పోలేదంటూ వాపోతున్నారు. ఈ కష్టాలు, నష్టాలు, పెనాల్టీలు, వడ్డీల బారిన పడకుండా ఉండేందుకు పలువురు మిల్లర్లు అక్రమాలకు తెరతీస్తూ.. పక్కదాని పడుతున్నారని వారంటున్నారు. నిబంధనల బూచి చూపెట్టి.. తమ నుంచి బియ్యాన్ని రాబట్టేందుకు పెనాల్టీలు, వడ్డీలు విధిస్తున్న ప్రభుత్వం.. నాణ్యమైన ధాన్యం సరఫరా, టెస్ట్ మిల్లింగ్ చేసి ఇవ్వాల్సిన బియ్యం శాతం నిర్ధారణ, సకాలంలో గోదాముల్లో ఖాళీ స్థలం ఉంచేలా చూడాల్సిన బాధ్యతలను మాత్రం విస్మరిస్తుందని వారంటున్నారు. ఈ ధోరణి ఇలాగే కొనసాగితే.. భవిష్యత్తులో రైస్ మిల్లర్ల వ్యవస్థ పూర్తిగా కునారిల్లిపోవడమో, లేక ధాన్యం మిల్లింగు చేయకుండా చేతులెత్తేయడమో జరుగుతుందని మిల్లర్లు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారానికి ముందుకురావాలని వారు కోరుతున్నారు. రైస్ మిల్లర్ల మెడకు.. ఈ మూడు ముఖ్యమైన అంశాల్లో ప్రభుత్వం సరిగ్గా వ్యవహరించకపోవడంతో.. రైస్ మిల్లర్లు డిఫాల్టర్లుగా మారుతున్నారని మిల్లర్లు వాపోతున్నారు. 15 శాతం ముక్కిన/రంగు మారిన ధాన్యం ఇచ్చి.. 2 శాతం ముక్కిన/రంగు మారిన బియ్యం ఇస్తే తీసుకోవడం లేదు. మరీ ముఖ్యంగా ఎఫ్‌సీఐ అయితే.. 0.5 శాతం ఉన్నా.. ససేమిరా అంటూ వెనక్కి పంపిస్తున్నారు. 3 శాతం నిబంధనను ప్రభుత్వ పాటించడం లేదు. పైగా 67 శాతం బియ్యం రావంటున్నా.. బలవంతంగా మిల్లర్ల వద్దకు ధాన్యాన్ని పంపిస్తున్నారు. మరి 15 శాతం ముక్కిన/రంగుమారిన ధాన్యంతో 67 శాతం బియ్యాన్ని ఎలా సరఫరా చేయాలంటూ మిల్లర్లు తలలు బాదుకుంటున్నారు. ఇదే సమయంలో వీలైనంత బియ్యాన్ని ఎఫ్‌సీఐకి, సివిల్ సప్లకి రవాణా చేసినా, గోదాముల్లో కొరత కారణంగా ఆలస్యం అవుతోంది. దీని ప్రభావం రైస్ మిల్లర్లపైనే పడుతోంది.

# కమర్షియల్ రియల్ ఎస్టేట్లో కింగ్

**హైదరాబాద్, మే 23 (సూర్య సేన) :** ప్రపంచవ్యాప్తంగా ఇబ్బందికరమైన వాతావరణం ఉంది. కార్పొరేట్ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు వెనకాడుతున్నాయి. ఉన్న ఉద్యోగులను సైతం తొలగిస్తున్నాయి. సాధ్యమైనంతవరకు మెరుగైన టెక్నాలజీతో.. తక్కువ మ్యాన్ పవర్ తో పనులు చేయించుకుంటున్నాయి. దీంతో కంపెనీల పెట్టుబడులు చాలా వరకు తగ్గిపోయాయి. కార్పొరేట్ ఆఫీస్ లీజు కూడా నేల చూపులు చూస్తోంది. ఇలాంటి సమయంలో ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోంది హైదరాబాద్. కమర్షియల్ రియల్ ఎస్టేట్లో హైదరాబాద్ కింగ్ లాగా దూసుకుపోతోంది. ముఖ్యంగా గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు హైదరాబాద్ నగరంలో విస్తృతంగా ఏర్పాటు అవుతున్న నేపథ్యంలో కార్యాలయాల స్థలాల లీజింగ్ విపరీతంగా పెరిగింది. ముఖ్యంగా లక్ష నుంచి పదిలక్షల విస్తీర్ణం వరకు విస్తీర్ణం ఉన్న కార్యాలయాలలో ఆయా సంస్థలు తమ పనులు మొదలుపెడుతున్నాయి. భారీ ధరకు ఒప్పందాలు చేసుకుంటున్నాయి. ప్రస్తుత ఏడాది తొలి త్రైమాసికంలో హైదరాబాద్ నగరంలో 69% అభివృద్ధి నమోదయింది. గతంలో ఇది 40 శాతం వరకు ఉండేది. గత ఏడాది ఇదే సమయానికి 26 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణానికి లీజింగ్ జరిగింది. ఈ సంవత్సరం ఈ సమయానికి 44 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణానికి అది పెరిగింది. అదే కాదు గడిచిన మూడు నెలల్లో ఏకంగా 59 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కార్యాలయాల లావాదేవీలు జరిగాయి. ఇందులో భారీ కార్యాలయాల స్థలాల వాటా 75% గా ఉంది. ఇందులో 50 వేల చదరపు అడుగుల విస్తీర్ణం ఉన్న కార్యాలయాల వాటా 8 శాతం ఉంది. ఐదు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ కంపెనీలు తమ కార్యాలయాలను ఏర్పాటు చేశాయి. మిడిల్ రేంజ్ లో కార్యాలయాల స్థలాలు 50వేల నుంచి లక్ష చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేశాయి. వీటి వాటా ఏకంగా 17 శాతం ఉంది. ఇక 10 లక్షల చదరపు అడుగుల లీజింగ్ భాగంలో కూడా ఒప్పందం కుదిరింది. దీని వాటా కూడా రెండు నుంచి మూడు శాతం వరకు ఉండే అవకాశం ఉంది. ఇటీవల ఉబర్ కంపెనీ గ్లోబల్ క్యాబబులిటీ సెంటర్ విస్తరణ కోసం హైదరాబాద్ ఐటి కారిడార్ పరిధిలోని మీనాక్షి ఎకో పార్కులో ఏకంగా 9.1 లక్షల చదరపు అడుగుల కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది. జనవరిలో వీరుని లీజుకు తీసుకుంది. దాదాపు మొత్తం 10 అంతస్తులో ఈ సంస్థ కార్యాలయాన్ని నిర్వహిస్తోంది. ప్రతి నెల దీనికి 5.86 కోట్ల అద్దె చెల్లిస్తోంది. చదరపు అడుగుకు 65 రూపాయల అద్దె చెల్లిస్తున్నట్టు సమాచారం. ప్రతి మూడు సంవత్సరాలకు 15% పెరుగుతుంది. పది సంవత్సరాలపాటు లీజు ఒప్పందం ఉంటుంది. మొత్తంగా 10 సంవత్సరాల వరకు చెల్లించే ఏకంగా 839 కోట్ల వరకు ఉంటుంది.. హైదరాబాద్ నగరంలో ఇటీవల కాలంలో జరిగిన అతిపెద్ద లీజింగ్ ఒప్పందంలో ఇది ఒకటి. హైదరాబాద్ నగరంలో స్థలాలు విస్తీర్ణంగా ఉండడం.. ఎటువంటి ఇబ్బందులు లేకుండా కార్యకలాపాలు సాగించే అవకాశం ఉండడం.. ఐటీ రంగం.. ఫార్మా రంగం అద్భుతంగా ఉండడంతో ఫైనాన్స్.. మొబిలిటీ వంటి రంగాలలో దిగ్గజాలుగా ఉన్న సంస్థలు హైదరాబాద్ నగరం వైపు దృష్టిసారిస్తున్నాయి. బెంగళూరు, ముంబై, చెన్నై వంటి నగరాలతో పోలిస్తే హైదరాబాదులో అద్దె తక్కువగా ఉంది. అందువల్లే కంపెనీలు ఇక్కడికి వస్తున్నాయి.

# మద్యం ధరలకు రెక్కలు

**హైదరాబాద్,మే 23 (సూర్య సేన) :** తెలంగాణలో మద్యం ధరలు పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు మద్యం ధరలు చివరిసారిగా 2023 మే నెలలో పెంచారు. ఆ తరువాత ఏడాదికిపైగా మద్యం ధరలు స్థిరంగా ఉండటంతో ప్రస్తుతం మరోసారి పెంపునకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. మద్యం ధరల పెంపుపై ప్రభుత్వం నియమించిన కమిటీ డిస్టిలరీల ప్రతిపాదనలను పరిశీలిస్తోంది. ఈ కమిటీలో ఆర్థిక, ఆమోదం, పరిశ్రమ శాఖల అధికారులు ఉన్నారు. ధరల పెంపునకు కారణాలు నివేదించనున్నారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చులు, పన్నులు, రవాణా ఖర్చులు అధికమవడంతో ధరలు పెరుగుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఏ బ్రాండ్ పై ఎంత ధర ఉండనుంది అంటేమద్యం ధరలు గత రెండేళ్లుగా స్థిరంగా కొనసాగాయి. దీంతో డిస్టిలరీలు నష్టాలు చవిచూస్తున్నాయని తెలుపుతున్నారు. దీంతో వారి ప్రతిపాదనను రాష్ట్రప్రభుత్వం నియమించిన కమిటీకి నివేదించారు. దీనిపై కమిటీ పరిశీలిస్తోంది. ఇందులో భాగంగా సాధారణ బ్రాండ్ ఫుల్ బాటిల్‌పై రూ.60, ప్రీమియం బ్రాండ్‌లపై రూ.100, హయ్యర్ కేటగిరీ బ్రాండ్‌లపై రూ.120 పెంపు జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే డిస్టిలరీల నుంచి వచ్చిన ప్రతిపాదనల ఆధారంగానే పెంపు ఉంటుందని సమాచారం. రెండేళ్లకోసారి జరిగే ధరల సవరణ ఈసారి ఆలస్యం అయ్యింది. కాబట్టి రెండు రోజుల్లోనే అధికారిక ప్రకటన వచ్చే సూచనలు ఉన్నాయి. ఈ ధరల పెంపు ప్రజల జీవితంపై ప్రభావం చూపే అవకాశాలు ఉన్నాయి. మద్యంపై ఆసక్తి ఉన్నవారికి ఖర్చు ఎక్కువవుతుంది. అయితే ప్రభుత్వం దీని ద్వారా ఆదాయం పెంచుకోవాలని భావిస్తోంది. గతంలో కూడా ఇలాంటి పెంపులు జరిగాయి. ఈసారి పెంపు మేర తక్కువగా ఉంటే కూడా ప్రజల నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంది. అధికారిక ప్రకటన తర్వాత బార్లు, వైన్సులల్లో కొత్త ధరలు అమలవుతాయి. డిస్ట్రిక్ట్‌ల వారీగా మార్కెటింగ్ విభాగం పరిశీలిస్తుంది. ప్రస్తుతం ఈ విషయంపై రాజకీయ చర్చలు జరుగుతున్నాయి. ప్రతిపక్షాలు దీన్ని విమర్శిస్తున్నాయి. మద్యం ధరల పెంపు రాష్ట్ర ఆర్థికాలకు ఎలా దోహదపడుతుందో చూడాలి. ఇదిలా ఉండగా ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో గణనీయంగా పెరిగాయి. ప్రభుత్వం బీర్ల గరిష్ఠ చిల్లర ధర (ఓఖీఖ)పై సుమారు 15 శాతం పెంపు జారీ చేసింది. దీంతో లైట్ బీర్ దాదాపు రూ.150 నుంచి సుమారు రూ.180కి పెరిగింది. స్ట్రాంగ్ బీర్ రూ.160 నుంచి దాదాపు రూ.190కి పెరిగింది. మరికొన్ని ప్రీమియం బ్రాండ్లలో ఒక్కో బీర్‌పై సగటున రూ.30 నుంచి 40 వరకు పెంచారు. అయితే మద్యం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో బీర్ల ధరలు పెరుగుతాయా..? చూడాలి

# ఎవరికి ఎర్త్...ఎవరికి బెర్త్... రేసులో ఈటెల, ధర్మపురి



**హైదరాబాద్, మే 23 (సూర్య సేన) :** తెలంగాణలో బీజేపీ బలపడుతున్న తరుణంలో, కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ రాజకీయ వర్గాల్లోనూ వేడి పుట్టిస్తోంది. కేంద్రంలో మోదీ 3.0 సర్కార్ రెండేళు పూర్తి చేసుకుంటున్న తరుణంలో, తెలంగాణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కనిపిస్తోంది. రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా పావులు కదుపుతున్న బీజేపీ, సామాజిక సమీకరణాలను బ్యాలెన్స్ చేసే దిశగా కొత్త నిర్ణయాలు తీసుకోబోతోంది. ఇప్పటికే రాష్ట్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ కు కేబినెట్ ర్యాంకు ఇస్తారనే టాక్ ఢిల్లీ వర్గాల్లో వినిపిస్తోంది. ఆయనకు ఉన్న మాస్ ఇమేజ్, పార్టీ కేడర్‌లో ఉన్న పట్టును దృష్టిలో ఉంచుకుని ఆయన పోర్ట్‌ఫోలియోను పెంచే అవకాశం ఉంది. వాస్తవానికి ఆయన కుమారుడు భగీరథ్‌పై పోక్సో కేసుతో ఆయనను అసలు మంత్రి వర్గం నుంచి భర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ లాంటి పార్టీలు డిమాండ్ చేస్తున్నారు. కానీ మోదీ భిన్నంగా ఆలోచించే అవకాశం ఉంది. తెలంగాణ రాజకీయాల్లో బలమైన నేతగా ఉన్న ఈటల రాజేందర్‌ను కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకుంటారనే గాసిప్స్ బలంగా వినిపిస్తున్నాయి. బీసీ సామాజిక వర్గానికి చెందిన ఆయనను కేంద్రంలోకి తీసుకోవడం ద్వారా బీఆర్ఎస్, కాంగ్రెస్ ఓటు బ్యాంకుకు గండి కొట్టవచ్చని బీజేపీ యోచిస్తోంది. ఆయనకు కేబినెట్ లేదా స్వతంత్ర హోదా కలిగిన రాష్ట్ర మంత్రి పదవి దక్కవచ్చని ప్రచారం. మహిళా కోటాలో, దక్షిణ తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహించే నేతగా డి.కె. అరుణ పేరు పరిశీలనలో ఉంది. జాతీయ స్థాయిలో పార్టీ ఉపాధ్యక్షురాలిగా పనిచేసిన అనుభవం ఆమెకు కలిసి వచ్చే అంశం. ఉత్తర తెలంగాణ నుంచి బలమైన వాయిస్ వినిపించే అరవింద్‌ను కూడా ఏదైనా కీలక బాధ్యతల్లోకి తీసుకునే అవకాశం ఉందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం బొగ్గు మరియు గనుల శాఖ మంత్రిగా ఉన్న జి. కిషన్ రెడ్డికి బాధ్యతల మార్పు ఉంటుందా అనే చర్చ కూడా నడుస్తోంది. ఆయనను పూర్తిగా పార్టీ సంస్థాగత పనులకు పరిమితం చేస్తారా లేదా ఇంకా కీలకమైన శాఖను అప్పగిస్తారా అనేది ఆసక్తికరంగా మారింది. తెలంగాణలో బీజేపీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉన్నందున, ఆయన అనుభవాన్ని ఎక్కడ వినియోగిస్తారనేది ప్రధాని నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. తెలంగాణలో 2028 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా మోదీ తన టీమ్‌ను సిద్ధం చేసుకుంటున్నారు. కేబినెట్ లో చోటు కల్పించడం ద్వారా ఆయా ప్రాంతాల్లో బీజేపీ బలాన్ని పెంచుకోవాలన్నది వ్యూహం. ఒకవేళ కేబినెట్ విస్తరణ జరిగితే తెలంగాణ నుంచి కనీసం ముగ్గురు లేదా నలుగురికి అవకాశం దక్కవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి మరోసారి కేంద్ర కేబినెట్‌ను పునర్ వ్యవస్థీకరించే అవకాశం లేదు. అందుకే వచ్చే ఎన్నికలకు ఇప్పుడే పూర్తి స్థాయిలో మంత్రివర్గ సమీకరణాలనులెక్కలోకి తీసుకోనున్నారు.

# పది రోజుల్లో రూ.100 పెరిగిన చికెన్

**హైదరాబాద్ మే 23 (సూర్య సేన) :** తెలుగు రాష్ట్రాల్లో నాన్‌వెజ్ ప్రియులకు చికెన్ ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. రోజురోజుకు పెరుగుతున్న ధరలతో చికెన్ ప్రియులు షాకవుతున్నారు. ముఖ్యంగా మేలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో చికెన్ ధరలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. సాధారణంగా మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండే చికెన్ రేట్లు, కేవలం 10-15 రోజుల్లోనే కిలోపై రూ.100 వరకు పెరగడం సామాన్యుడికి పెద్ద భారంగా మారింది. ప్రస్తుతం మార్కెట్‌లో స్కిన్‌లెస్ చికెన్ ధర కిలో రూ. 350 నుండి రూ. 370 మార్కును దాటగా, కొన్ని ప్రాంతాల్లో రూ. 400 వరకు కూడా విక్రయిస్తున్నారు. ఫాం కేజీ కోడి ధర 115 రూపాయలు ఉంది.. డ్రెస్సెడ్ చికెన్ 220 ? 240 వరకు.. స్కిన్ లెస్ రూ.250 వరకు ఉంది.. హైదరాబాద్ నగరంలో కేజీ చికెన్ ధర రూ.270 వరకు విక్రయిస్తున్నారు. గుడ్ల డజన్ రూ. 72 వరకు ఉంది. అయితే.. ప్రాంతాల వారీగా చికెన్ ధరల్లో వ్యత్యాసం ఉంటుంది.. ఆదివారం కూడా దాదాపుగా ఇవే ధరలు కొనసాగుతాయని కోళ్ల ఫాం యజమానులు, చికెన్ వ్యాపారస్థులు చెబుతున్నారు. వేసవి ఎండల తీవ్రత: ఈ ఏడాది వేసవి ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరగడం పౌల్ట్రీ రంగాన్ని దెబ్బతీసింది. విపరీతమైన వేడి తట్టుకోలేక కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. దీనివల్ల ఫారాలలో కోళ్ల ఉత్పత్తి, బరువు గణనీయంగా తగ్గిపోయాయి. ఎండల దెబ్బకు నష్టాలు వస్తుండటంతో పౌల్ట్రీ రైతులు కూడా కొత్త బ్యాచ్‌ల పెంపకంపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఉత్పత్తి తగ్గిపోవడంతో మార్కెట్‌కు కోళ్ల సరఫరా చాలా వరకు క్షీణించింది. అయితే, ఇదే సమయంలో పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాల సీజన్ నడుస్తుండటంతో చికెన్‌కు డిమాండ్ భారీగా పెరిగింది. సప్లై తక్కువగా ఉండి, డిమాండ్ ఎక్కువగా ఉండటంతో ధరలకు రెక్కలు వచ్చాయి. వీటికి తోడు నిర్వహణ ఖర్చులు పెరగడం వల్ల.. చికెన్ ధరలు పెరిగాయని వ్యాపారస్థులు చెబుతున్నారు.

# తమిళనాడు, కేరళలో ఏఐ మంత్రులు..అప్ డేట్ కేబినెట్స్

**బెంగళూరు, మే 23 (సూర్య సేన) :** కేరళ , తమిళనాడు ప్రభుత్వాలు సాంకేతిక రంగంలో మరో విప్లవాత్మక అడుగు వేశాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖలను ఏర్పాటు చేసి మంత్రులను నియమించారుకేరళ, తమిళనాడుల్లో కొత్త ప్రభుత్వాలు ఏర్పాటయ్యాయి. కేరళ సీఎం సతీశన్, తమిళనాడు సీఎం విజయ్ సాంకేతికత వేగంగా మారుతున్న తరుణంలో, కేవలం ఐటీ శాఖకు పరిమితం కాకుండా ఏఐ కోసం ప్రత్యేక పోర్ట్‌ఫోలియోను కేటాయించడం ద్వారా తమ దూరదృష్టిని చాటుకున్నారు. తమిళనాడు మంత్రివర్గ విస్తరమలో వేళచ్చేరి నియోజకవర్గ ప్రతినిధి కుమార్‌కు ఈ బాధ్యతలు అప్పగించడం ద్వారా యువతకు ,టెక్నాలజీకి పెద్దపీట వేసినట్లయింది. భవిష్యత్తులో ఉద్యోగాల సృష్టి, డేటా సెంటర్లు , స్మార్ట్ గవర్నెన్స్‌లో ఈ శాఖ కీలక పాత్ర పోషించనుంది. కొత్తగా నియమితులైన ఏఐ మంత్రుల ముందు అనేక సవాళ్లు ఉన్నాయి. తమిళనాడు ఏఐ మంత్రి ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత వేగంగా చేరవేయడానికి ఏఐ టూల్స్‌ను ఉపయోగించడం, భాషా అడ్డంకులను తొలగించడానికి తమిళ భాషా ఏఐ మోడల్స్ ను అభివృద్ధి చేయడం ఈ శాఖ ప్రధాన లక్ష్యం. ముఖ్యంగా వ్యవసాయం, విద్య, వైద్య రంగాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో వినూత్న మార్పులు తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇది కేవలం సాంకేతిక శాఖ మాత్రమే కాదు, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించే ఇంజిన్‌గా మారబోతోంది. ప్రపంచవ్యాప్తంగా టెక్ దిగ్గజాలు ఏఐ రంగంలో భారీ పెట్టుబడులు పెడుతున్నాయి.

# కేంద్ర కేబినెట్ విస్తరణ...

**న్యూఢిల్లీ, మే 23 (సూర్య సేన) :** దేశంలో ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిపోయాయి. ఆయా రాష్ట్రాల్లో కొత్త ప్రభుత్వాలు కూడా ఏర్పడ్డాయి. ఇప్పుడు కేంద్రం వంతు వచ్చింది. మిషన్ 2029కి ఇప్పటి నుంచే మోడీ సన్నాహాలు మొదలు పెట్టినట్లుగా తెలుస్తోంది. ప్రభుత్వంలోనూ.. పార్టీలోనూ కీలక మార్పులు చేయాలని భావిస్తున్నట్లుగా సమాచారం. 2029లో తిరిగి అధికారంలోకి రావడమే లక్ష్యంగా భారీ మార్పులు జరగవచ్చని సంకేతాలు వెలువడుతున్నాయి. ఈనెల 26తో మోడీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి కాబోతుంది. ఈ నేపథ్యంలో కేంద్ర కేబినెట్‌ను విస్తరించాలని భావిస్తున్నారు. మోడీ తన మొదటి, రెండవ పర్యాయాల్లో మంత్రివర్గాన్ని క్రమం తప్పకుండా విస్తరించారు. ప్రస్తుత మంత్రివర్గంలో 72 మంది సభ్యులు ఉండగా.. గరిష్ఠంగా 81 మంది మంత్రులను నియమించుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణ చేయాలని భావిస్తున్నారు. ఇక ఇటీవల బీహార్, ఉత్తరప్రదేశ్‌లోని ఎన్డీఏ ప్రభుత్వాలు కూడా తమ మంత్రివర్గాలను విస్తరించాయి. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నవీన్ తన బృందాన్ని కూడా ఏర్పాటు చేస్తారని తెలుస్తోంది. ఈ క్రమంలోనే కేంద్ర మంత్రివర్గంలో మార్పులు జరుగుతాయనే ఊహాగానాలకు ఆజ్యం పోసింది. గత రెండు పర్యాయాలను పరిశీలిస్తే.. ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల తర్వాత నవంబర్ 2014లో మోడీ తన మంత్రివర్గాన్ని తొలిసారిగా విస్తరించారు. సుమారు ఏడాదిన్నర తర్వాత జూలై 2016లో రెండవ విస్తరణ జరిగింది. సెప్టెంబర్ 2017లో జరిగిన మొదటి పర్యాయపు చివరి విస్తరణలో పలువురు మంత్రులకు పదోన్నతి లభించింది. ఇక రెండవ పర్యాయంలో ప్రభుత్వం ఏర్పడిన దాదాపు రెండేళ్ల తర్వాత జూలై 2021లో మంత్రివర్గాన్ని తొలిసారిగా విస్తరించారు. మే 2023లో పోర్ట్‌ఫోలియోల పునర్వ్యవస్థీకరణ జరిగింది.




# డెస్క్ నుంచి మీ వస్తువులు తీసుకుని వెళ్లిపోండి..




ఉద్యోగులకు మెటా మరో మెయిల్ తాజాగా తొలగించిన ఉద్యోగులకు మరోసారి కంపెనీ మెయిల్స్ పంపింది. డెస్క్ దగ్గర ఉద్యోగులకు సంబంధించిన ఏవైనా వ్యక్తిగత వస్తువులు ఉంటే తీసుకుని, ఆఫీసుల నుంచి వెళ్లిపోవాలని సూచిస్తూ తాజా మెయిల్ పంపింది. ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా భారీ లేఆఫ్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా 8,000 మంది ఉద్యోగుల్ని తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇది సంస్థ ఉద్యోగుల్లో మొత్తం 10 శాతం సిబ్బందితో సమానం. ఈ మేరకు ఉద్యోగులకు ఇప్పటికే మెయిల్స్ పంపింది. తాజాగా తొలగించిన ఉద్యోగులకు మరోసారి కంపెనీ మెయిల్స్ పంపింది. గురువారం ఉదయం 4 గంటలకు కంపెనీ మళ్లీ మెయిల్స్ పంపింది. డెస్క్ దగ్గర ఉద్యోగులకు సంబంధించిన ఏవైనా వ్యక్తిగత వస్తువులు ఉంటే తీసుకుని, ఆఫీసుల నుంచి వెళ్లిపోవాలని సూచిస్తూ తాజా మెయిల్ పంపింది.

అంతేకాదు.. త్వరలో ఉద్యోగుల బ్యాడ్జీలు డీయాక్టివేట్ చేయనున్నట్లు, ఇంటర్నల్ సిస్టమ్స్ యాక్సెస్ చేయకుండా పూర్తిగా తొలగించనున్నట్లు వెల్లడించింది.

ఉద్యోగులకు ఈ మెయిల్ అందిన గంట వ్యవధిలోనే వారందరినీ అల్యూమ్ని పోర్టల్‌లో చేర్చింది. అంటే.. సంస్థ పూర్వపు ఉద్యోగుల జాబితాలో చేర్చింది. ఇందులో లేఆఫ్స్ ఇచ్చిన ఉద్యోగులకు అందించనున్న ప్రయోజనాలు, బెనిఫిట్స్, వీసా సౌకర్యాల గురించిన వివరాలు అందుబాటులో ఉంటాయి. ఉద్యోగులు తమకు అందబోయే ప్రయోజనాల గురించి తెలుసుకోవచ్చు. ప్రస్తుతం మెటా సంస్థ ఏఐ మీద ఫోకస్ చేయనుంది. 8,000 మంది ఉద్యోగుల్ని తొలగించిన కంపెనీ.. మిగతా ఉద్యోగుల్లో 7,000 మందిని ఏఐ టెక్నాలజీ వైపు మళ్లించనుంది.

ఉద్యోగుల తొలగింపుపై మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ ఆవేదన వ్యక్తం చేశాడు. తొలగించిన ఉద్యోగులకు జుకర్‌బర్గ్ ప్రత్యేక మెమో అందజేశాడు. కంపెనీ నిర్మాణంలో పాలుపంచుకుని, తమ లక్ష్యాలు నెరవేర్చడంలో సాయపడిన వారికి గుడ్‌బై చెప్పడం బాధగా ఉందన్నాడు. ఆ బాధను తాను అనుభవిస్తున్నట్లు చెప్పాడు. అయితే, ఈ ఏడాది మళ్లీ భారీ స్థాయిలో మిగిలిన ఉద్యోగుల్ని తొలగించబోనని ప్రకటించాడు. ఇది మిగిలిన ఉద్యోగులకు కాస్త ఊరట కలిగించే అంశం. 2022--2023 నుంచి మెటా భారీగా ఉద్యోగుల్ని తొలగిస్తూ వస్తోంది.

## నష్టాల్లో ముగిసిన భారతీయ స్టాక్ మార్కెట్..



భారతీయ స్టాక్ మార్కెట్లు గురువారం నష్టాల్లో ముగిశాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 135.03 పాయింట్లు నష్టపోయి, 75,183.36 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా స్వల్పంగా.. అంటే 4.30 పాయింట్లు నష్టపోయి 23,789 పాయింట్ల వద్ద ముగిసింది. ఉదయం ట్రేడింగ్ లాభాల్లోనే కొనసాగింది. సెన్సెక్స్ ఒకదశలో 500 పాయింట్లు పెరిగింది. ఉదయం లాభాల్లో ప్రారంభమైన మార్కెట్ చివరికి నష్టాల్లో ముగిసింది. క్రూడాయిల్ ధరలు తగ్గడం, ఇరాన్‌తో చర్చలు జరుగుతాయని ట్రంప్ ప్రకటిండచడం ఉదయం మార్కెట్‌కు కలిసొచ్చింది. ఆర్బీఐ రేట్లు పెంచుతుందనే భయం, ద్రవ్యోల్బణం పెరుగుదల, అంతర్జాతీయ పరిణామాలు వంటివి మార్కెట్ నష్టాలకు కారణాలు. ఐటీ, ఎఫ్ఎంసీజీ షేర్లపై ఒత్తిడి పెరగడంతో మార్కెట్ ప్రభావితమైంది. సెన్సెక్స్ 30 సూచీలో బజాజ్ ఫైనాన్స్, టెక్ మహీంద్రా, బజాజ్ ఫిన్‌సర్వ్, ఇన్ఫోసిస్, హిందుస్తాన్ యునీలీవర్ షేర్లు నష్టపోయాయి. అల్ట్రాటెక్, ఇండిగో, అదానీ పోర్ట్స్, ట్రెంట్, బీఈఎల్ షేర్లు లాభాలు చవిచూశాయి. నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.63 శాతం పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధర స్వల్పంగా తగ్గింది. బ్యారెల్ క్రూడాయిల్ ధర 104 డాలర్ల వద్ద కొనసాగింది. బంగారం ఔన్స్ ధర 4518 డాలర్ల వద్ద కొనసాగింది.

మరోవైపు గురువారం రూపాయి స్వల్పంగా లాభపడింది. డాలర్‌తో రూపాయి 63 పైసలు బలపడి 96.23కు చేరింది.

# ఏఐ టూల్ చేయించుకొని.. ఆపై లేఆఫ్ వేసి..!

ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా(వీమ్ఖ) తన ఉద్యోగుల్లో 10 శాతం మందిని తొలగించిన సంగతి తెలిసిందే. ఈ లేఆఫ్స్ (శ్రీఖఎశీటటం)కి ముందు మెటా తన ఉద్యోగులతో ఏఐ టూల్స్ తయారుచేయించినట్లు తెలుస్తోంది. వారి స్థానంలో ఈ టూల్స్‌ను భర్తీ చేసినట్లు ఆ సంస్థలో పనిచేసి లేఆఫ్‌కు గురైన ఓ ఉద్యోగిని భర్త ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ప్రస్తుతం ఈ పోస్టు నెట్టింట తీవ్ర చర్చనీయాంశంగా మారింది. జూలియన్ అనే వ్యక్తి పెట్టిన పోస్టు ప్రకారం.. మెటా కొన్ని నెలల క్రితం కంపెనీలో ‘‘ూ× షవవన’ని నిర్వహించింది. ఆ సమయంలో కంపెనీలోని సాధారణ పనులు చేయడం ఆపేసి.. అంతర్గత ఏఐ టూల్స్ రూపొందించడంపై దృష్టిపెట్టాలని ఉద్యోగులను ఆదేశించింది. ఆ తర్వాత వాటిల్లో కొన్నింటిని ఎంపిక చేసుకొని.. వాటిని మరింత డెవలప్ చేయాలని కోరింది. ఈ టాస్క్‌లో తన భార్య కూడా భాగమైనట్లు జూలియన్ తెలిపారు.

ఈ టూల్స్ చివరికి తమ స్థానాన్ని భర్తీ చేస్తాయేమోనని ఆమె భయపడిందన్నారు. సీనియర్ ఇంజినీర్లతో కలిసి ఒక ఏఐ టూల్‌ను రూపొందించడానికి ఆమె నెలలతరబడి కష్టపడిందన్నారు. ఈ క్రమంలో తాజాగా కంపెనీ ప్రకటించిన లేఆఫ్‌లలో తన భార్య ఉద్యోగం కోల్పోయిందన్నారు.

ఈ ఏఐ టూల్స్ నిర్మించడంపై మెటా నుంచి ఎలాంటి అధికారిక ధ్రువీకరణ లేదు. ఈ పోస్టు సామాజిక మాధ్యమాల్లో తెగ వైరల్ అవుతోంది. ఏఐ యుగంలో వైట్‌కాలర్ ఉద్యోగాలకు ఇది ఒక హెచ్చరికగా నెటిజన్లు అభివర్ణిస్తున్నారు. ఏఐతో ఎంట్రీ-లెవల్ ఉద్యోగాలకు ముప్పు..! సంతోషంగా ఉంది.. ఇదిలాఉండగా.. మెటా తనను ఉద్యోగం నుంచి తొలగించడంపై శాన్‌ఫ్రాన్సిస్కోకు చెందిన




ఆశా రావల్ అనే మహిళ ఆనందం వ్యక్తంచేశారు. ఆశా రావల్ 2022 నుంచి మెటాలో ప్రొడక్ట్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల జరిగిన లేఆఫ్స్‌లో ఆమె కూడా ఉద్యోగం కోల్పోయారు. ఇందుకు తాను బాధపడటం లేదని.. పైగా చాలా సంతోషంగా, స్వేచ్ఛగా అనిపిస్తుందంటూ ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియో పోస్టు చేశారు. ఈ వీడియో కూడా ప్రస్తుతం వైరల్ అవుతోంది.

## రూపాయి విలువ తగ్గనీయండి: అరవింద్ పనగారియా




అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితుల నేపథ్యంలో రూపాయి విలువ రోజురోజుకు పతనమవుతోంది. ఈ క్రమంలోనే నీతి ఆయోగ్ మాజీ వైస్ ఛైర్మన్ అరవింద్ పనగారియా (ూతీఙఱఅఎ ౡఖఱఞ్ఘుతీఱఖ).. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (=దీ×)కు కీలక సూచనలు చేశారు. చమురు కొరత స్వల్పకాలికమైనా.. దీర్ఘకాలికమైనా రూపాయి విలువ తగ్గాల్సిందేనన్నారు. డాలర్‌కు రూ.100 అనేది కేవలం మానసిక భావనే అని పేర్కొన్నారు. చమురు దిగుమతులు తగ్గగానే తిరిగి రూపాయి పుంజుకుంటుందని పేర్కొన్నారు. రూపాయి విలువ తగ్గితే దిగుమతులకు అయ్యే ఖర్చు పెరిగినప్పటికీ.. విదేశీ పెట్టుబడులను ఆకర్షించే అవకాశం ఉంటుందని వెల్లడించారు. తద్వారా రూపాయి విలువ తగ్గడం వల్ల కలిగే నష్టాన్ని భర్తీ చేయొచ్చని చెప్పారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. ప్రస్తుత చమురు కొరత కొన్ని నెలల నుంచి ఒక ఏడాది వరకు కొనసాగితే రూపాయి మొదట్లో బలహీనపడుతుందని.. కానీ పెట్టుబడిదారులు పెరగడం వల్ల భవిష్యత్తులో గణనీయంగా కోలుకుంటుందని అరవింద్ పనగారియా పేర్కొన్నారు. ఈ చమురు సంక్షోభం దీర్ఘకాలం కొనసాగితే.. భారత విదేశీ మారక నిల్వలను హరించివేస్తుందని హెచ్చరించారు. రూపాయి విలువ తగ్గింపు తప్ప మరే ఇతర మార్గాన్ని అనుసరించినా అది నష్టానికే దారితీస్తుందని తెలిపారు. ఈ సమయంలో డాలర్లలో జారీ చేసిన సావరిన్ బాండ్లు లేదా అధిక వడ్డీ ఇచ్చే ఎన్నారై డాలర్ డిపాజిట్లపై ఎక్కువగా ఆధారపడకూడదని ఆర్‌బీఐకి సూచించారు. వాటిని తాత్కాలిక, ఖరీదైన చర్యలుగా అభివర్ణించారు. రూపాయి బక్క చిక్కినా.. ఎగుమతులకు ఒరిగేదీ లేదు 2013 నాటి కరెన్సీ సంక్షోభంతో పోలిస్తే.. నేడు భారతదేశ స్థూల ఆర్థిక పరిస్థితి చాలా బలంగా ఉందని పనగారియా పేర్కొన్నారు. 2013లో ద్రవ్యోల్బణం రెండంకెల స్థాయిలో ఉండగా.. ప్రస్తుతం ఆర్‌బీఐ చేపడుతున్న మెరుగైన ద్రవ్య నిర్వహణ చర్యల వల్ల ద్రవ్యోల్బణ స్థాయిలు అదుపులో ఉన్నాయని పేర్కొన్నారు.

## స్టార్ హెల్త్ 1,254 కోట్ల క్లెయిం సెటిల్‌మెంట్





హైదరాబాద్, : గడిచిన ఆర్థిక సంవత్సరంలో తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్‌లో రూ.1,254 కోట్ల విలువైన 1.8 లక్షల పాలసీలు క్లెయిం చేశామని స్టార్ హెల్త్ ఎండీ, సీఈవో ఆనంద్ రాయ్ తెలిపారు. అంతక్రితం ఏడాది చేసిన రూ.1,014 కోట్ల కంటే ఇది 24 శాతం అధికమని పేర్కొన్నారు. కంపెనీ మొత్తం వ్యాపారంలో తెలుగు రాష్ట్రాల వాటా 10 శాతంగా ఉండగా, వచ్చే మూడు నుంచి నాలుగేండ్లలో ఇది 12 శాతం నుంచి 15 శాతానికి పెరుగనున్నదని ఆశిస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా రూ.24 వేల కోట్ల ప్రీమియం వసూళ్లు లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. ఇప్పటికే సంస్థ 35 హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్లను విక్రయిస్తున్నది.

## క్యాడ్ కట్టడికి అస్త్రాలున్నాయ్....




**న్యూఢిల్లీ :** ప్రస్తుత పరిస్థితుల్లో విస్తరిస్తున్న కరెంటు ఖాతా లోటు (క్యాడ్)ను కట్టడి చేసేందుకు పలు చర్యలను పరిశీలిస్తున్నట్టు కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. “పరిస్థితిని పర్యవేక్షిస్తున్నాం. ప్రభుత్వానికి సంబంధించి అన్ని శాఖలూ ఒక బృందంగా పనిచేస్తున్నాయి. పలు చర్యలను పరిశీలిస్తున్నాం. అంతర్జాతీయంగా నెలకొన్న సవాళ్లతో కూడిన పరిస్థితుల్లో విజేతగా అవతరిస్తామన్న నమ్మకం, ధైర్యం, దృఢ విశ్వాసంతో ఉన్నాం”అని మంత్రి పేర్కొన్నారు. కరెంట్ ఖాతా లోటు డిసెంబర్ త్రైమాసికంలో 13.2 బిలియన్ డాలర్లుగా ఉండడం గమనార్హం.

# పడేసిన పొదుపు పిలుపు



ముంబై: పశ్చిమాసియా యుద్ధంతో తలెత్తిన అనిశ్చితులు, ముడి చమురు ధరలు దూసుకెళ్లడంతో మంగళవారం దలాల్ స్ట్రీట్ 2% క్షీణించింది. దేశ ప్రజలు ‘పొదుపు చర్యలు’ పాటించాలంటూ ప్రధాని మోదీ పిలుపు ప్రభావం రెండో రోజూ కొనసాగింది.

విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు, ఫారెక్స్ మార్కెట్లో రూపాయి క్షీణత అంశాలు సెంటిమెంట్‌ను మరింత దెబ్బతీశాయి. ఫలితంగా సెన్సెక్స్ 1,456 పాయింట్లు కోల్పోయి 74,559 వద్ద ముగిసింది. నిఫ్టీ 436 పాయింట్లు క్షీణించి 23,380 వద్ద నిలిచింది. సూచీలకిది నాలుగోరోజూ నష్టాల ముగింపు. నష్టాలతో మొదలైన సూచీలు క్రమంగా తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అన్ని రంగాల షేర్లలో విక్రయాలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా ఐటీ షేర్లు భారీ అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఒకదశలో సెన్సెక్స్ 1566 పాయింట్లు పతనమై 74,449 వద్ద, నిఫ్టీ 468 పాయింట్ల క్రాష్‌తో 23,348 వద్ద ఇంట్రాడే కనిష్టాలను తాకాయి.



సూర్యసేన

ఆదివారం, మే 24, 2026

## వన్స్‌మోర్.. అల్లు అర్జున్‌తో 'బుట్టబొమ్మ' రొమాన్స్..!



టాలీవుడ్ స్టార్ యాక్టర్ అల్లు అర్జున్ ప్రస్తుతం రాకా సినిమాతో బిజీగా ఉన్నాడని తెలిసిందే. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ షూటింగ్ దశలో ఉంది. ఇదిలా ఉంటే మరోవైపు తమిళ దర్శకుడు లోకేశ్ కనగరాజ్‌తో ఓ సినిమాకు గ్రీన్ సిగ్నల్ కూడా ఇచ్చేశాడు. AA23గా రాబోతున్న ఈ సినిమాకు సంబంధించి ఆసక్తికర వార్త మూవీ లవర్స్‌ను ఎక్జయిటింగ్ అయ్యేలా చేస్తోంది. పొడుగు కాళ్ల సుందరి పూజా హెగ్డే ఈ చిత్రంలో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించనుందట. పూజా హెగ్డే ఇప్పటికే బన్నీతో కలిసి దువ్వాడ జగన్నాథం, అల వైకుంఠపురంలో సినిమాల్లో నటించింది. సిల్వర్ స్క్రీన్‌పై మ్యాజిక్ చేసిన ఈ బుట్టబొమ్మ మరోసారి అల్లు అర్జున్‌తో నటించబోతుందన్న వార్తను మూవీ లవర్స్‌తోపాటు అభిమానులు, ఫాలోవర్లు ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు. ప్రస్తుతం AA23 ప్రాజెక్ట్ ప్రీ ప్రొడక్షన్ దశలో ఉంది. అల్లు అర్జున్ నటిస్తోన్న రాకా షూటింగ్ పూర్తయిన తర్వాత ఈ మూవీ సెట్స్‌పైకి వెళ్లనుంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోన్న ఈ చిత్రానికి అనిరుద్ రవిచందర్ మ్యూజిక్ అందిస్తున్నాడు. గతేడాది రజినీకాంత్ టైటిల్ రోల్‌లో నటించిన కూలీ సినిమాలో మోనికా సాంగ్‌లో మెరిసింది. విజయ్‌తో నటించిన జయనాయగన్ విడుదలకు రెడీ అవుతోంది. తెలుగులో దుల్కర్ సల్మాన్ DQ41లో హీరోయిన్‌గా నటిస్తోంది. మరోవైపు తమిళంలో నటిస్తోన్న కాంచన 4 చిత్రీకరణ దశలో ఉంది.

## సమంత 'మా ఇంటి బంగారం' కొత్త రిలీజ్ డేట్..







స్టార్ హీరోయిన్ సమంత రూత్ ప్రభు ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'మా ఇంటి బంగారం'పై ప్రేక్షకుల్లో ఇప్పటికే భారీ ఆసక్తి నెలకొంది. ఫీమేల్ సెంట్రిక్ కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి ప్రముఖ దర్శకురాలు నందిని రెడ్డి దర్శకత్వం వహిస్తుండటంతో సినీ అభిమానుల్లో అంచనాలు మరింత పెరిగాయి. మొదట ఈ సినిమాను మే 15న విడుదల చేయాలని మేకర్స్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల ఈ మూవీ రిలీజ్ వాయిదా పడింది. దీంతో అభిమానులు కొత్త రిలీజ్ డేట్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తుండగా.. తాజాగా చిత్రబృందం అధికారిక ప్రకటనతో క్లారిటీ ఇచ్చింది. 'మా ఇంటి బంగారం' చిత్రాన్ని జూన్ 16న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన కొత్త పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సంప్రదాయ పట్టుచీరలో కనిపిస్తున్న సమంత చేతిలో తుపాకీ పట్టుకుని సీరియస్, యాంగ్రీ లుక్‌లో కనిపించడం ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటోంది. పోస్టర్‌ను చూస్తుంటే సినిమాలో ఆమె పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉండబోతుందనే అభిప్రాయం అభిమానుల్లో వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఈ సినిమాపై మంచి బజ్ ఏర్పడగా.. తాజా పోస్టర్ ఆ హైప్‌ను మరింత పెంచింది. ముఖ్యంగా సమంత గత కొంతకాలంగా విభిన్న కథలను ఎంచుకుంటూ నటిగా కొత్త కోణాలను చూపిస్తోంది. ఈ క్రమంలో 'మా ఇంటి బంగారం' కూడా ఆమె కెరీర్‌లో మరో ప్రత్యేక చిత్రంగా నిలుస్తుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

ఈ చిత్రాన్ని ట్రలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. సంగీత దర్శకుడు సంతోష్ నారాయణ్ ఈ సినిమాకు సంగీతం అందిస్తుండటం మరో ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఆయన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాటలు సినిమాకు అదనపు బలంగా నిలుస్తాయని అభిమానులు ఆశిస్తున్నారు. ఇక సమంతకు గత కొంతకాలంగా సోలో హిట్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో 'మా ఇంటి బంగారం' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనం సృష్టిస్తుందో చూడాలి.

### 'పెద్ది' ప్రమోషన్స్ గ్రాండ్ లెవల్‌లో..

## ముంబైలో ట్రైలర్ లాంచ్.. భోపాల్‌లో రెహమాన్ లైవ్ షో




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం పెద్ది విడుదలకు ముందే దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, పాటలు సినిమాపై అంచనాలను అమాంతం పెంచగా.. ఇప్పుడు మేకర్స్ ప్రమోషన్స్‌ను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్తున్నారు. 'పెద్ది' కోసం భారీ స్థాయిలో జాతీయ ప్రమోషనల్ క్యాంపెయిన్‌ను ప్లాన్ చేసినట్లు మేకర్స్ ప్రకటించారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'పెద్ది' థియేట్రికల్ ట్రైలర్‌ను మే 18న ముంబైలో నిర్వహించే గ్రాండ్ ఈవెంట్‌లో విడుదల చేయనున్నారు. ఈ ట్రైలర్ లాంచ్‌ను కేవలం సినిమా ఈవెంట్‌గా కాకుండా, పాన్ ఇండియా స్థాయిలో భారీ ప్రచార కార్యక్రమంగా మలచాలని చిత్రబృందం భావిస్తోంది. జాతీయ మీడియా దృష్టిని ఆకర్షించేలా ఈ ఈవెంట్‌ను ప్రత్యేకంగా ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఇక ట్రైలర్ లాంచ్‌తో ప్రమోషన్స్ ఆగిపోవడం లేదు. సినిమా కథలోని భారతీయ మూలాలను సెలబ్రేట్ చేసేలా మేకర్స్ మే 23న భోపాల్‌లో ప్రత్యేక సాంగ్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించనున్నారు. 'హార్ట్ ఆఫ్ ఇండియా'గా పేరుగాంచిన భోపాల్‌లో ఈ వేడుకను అత్యంత వైభవంగా ప్లాన్ చేస్తున్నారు. ఈ ఈవెంట్‌కు ప్రధాన ఆకర్షణగా ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ నిలవనున్నారు. 'పెద్ది' చిత్రానికి సంగీతం అందిస్తున్న రెహమాన్ స్వయంగా వేదికపై లైవ్ పెర్ఫార్మెన్స్ ఇవ్వనున్నారు. 'సౌండ్ ఆఫ్ పెద్ది' పేరుతో ప్రత్యేక మ్యూజికల్ ప్రెజెంటేషన్‌ను కూడా విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు. రెహమాన్‌తో పాటు పలువురు ప్రముఖ గాయకులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనబోతున్నారు. ఇప్పటికే విడుదలైన 'చికిరి చికిరి', 'రైరై రారా' పాటలు సోషల్ మీడియాలో భారీ స్పందన తెచ్చుకున్నాయి. ముఖ్యంగా రామ్ చరణ్ మాస్ లుక్, ఎనర్జిటిక్ స్క్రీన్ ప్రెజెన్స్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. విడుదలైన ప్రతి ప్రమోషనల్ కంటెంట్‌కు పాన్ ఇండియా స్థాయిలో రెస్పాన్స్ రావడంతో సినిమాపై భారీ హైప్ నెలకొంది. ఈ చిత్రానికి బుచ్చిబాబు సన దర్శకత్వం వహిస్తుండగా, వెంకట సతీష్ కిలారు వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శివరాజ్‌కుమార్, జగపతి బాబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఇక ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా 'పెద్ది' ఇప్పటికే రికార్డుల వేట మొదలుపెట్టినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా నార్త్ అమెరికాలో ప్రీమియర్ షోల ప్రీ-సేల్స్‌కు భారీ స్పందన లభిస్తోందని సమాచారం. ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని జూన్ 4, 2026న విడుదల చేయనుండగా.. జూన్ 3 నుంచే ప్రీమియర్ షోలు ప్రారంభం కానున్నాయి.

## ఆహాలోకి వచ్చిన 'తిమ్మరాజుపల్లి టీవీ'




తెలుగు ఓటీటీ ప్రేక్షకులకు ప్రముఖ ప్లాట్‌ఫామ్ ఆహా మరో ఇంట్రెస్టింగ్ మూవీని అందుబాటులోకి తీసుకొచ్చింది. యువ హీరో కిరణ్ అబ్బవరం నిర్మాతగా తెరకెక్కిన రూరల్ ఎంటర్టైనర్ తిమ్మరాజుపల్లి టీవీ ఇప్పుడు డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. ఇటీవల థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద డీసెంట్ టాక్ సంపాదించుకుంది. గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ఈ మూవీకి ఫ్యామిలీ ఆడియన్స్ నుంచి మంచి స్పందన లభించింది. ఈ చిత్రాన్ని దర్శకుడు వి. మునిరాజ్ తెరకెక్కించారు. ముఖ్యంగా ఈ సినిమాలో దాదాపు 50 మంది కొత్త ఆర్టిస్టులకు అవకాశం ఇవ్వడం విశేషం. గ్రామీణ జీవనశైలి, పల్లెటూరి భావోద్వేగాలు, వినోదాన్ని మేళవిస్తూ రూపొందించిన ఈ చిత్రం కొత్త తరహా కథనంతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇక ఓటీటీ రిలీజ్ విషయానికి వస్తే.. నుంచే ఆహా గోల్డ్ సబ్‌స్క్రైబర్లకు ఈ సినిమా ప్రత్యేకంగా స్ట్రీమింగ్‌కు అందుబాటు లోకి వచ్చింది. దీంతో గోల్డ్ సభ్యులు మిగతా ప్రేక్షకుల కంటే ఒక రోజు ముందుగానే సినిమాను వీక్షించే అవకాశం పొందారు. సాధారణ సబ్‌స్క్రైబర్లకు మాత్రం ఈ చిత్రం మే 15అర్ధరాత్రి 12 గంటల నుం చి అందుబాటులోకి రానుంది. థియేటర్లలో మిక్స్డ్ రెస్పాన్స్ అందుకున్న ఈ చిత్రం ఓటీటీ ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటుందనే అంశంపై ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా గ్రామీణ కథల్ని ఇష్టపడే ప్రేక్షకులకు ఈ మూవీ కనెక్ట్ అయ్యే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇప్పటికే విభిన్నమైన కంటెంట్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఆహా, ఈ సినిమాతో మరోసారి రూరల్ ఎంటర్టైన్మెంట్‌కు ప్రాధాన్యం ఇచ్చింది. కామెడీ, ఎమోషన్స్, గ్రామీణ వాతావరణం కలగలిపిన ఈ చిత్రం వీకెండ్ ఎంటర్టైనర్‌గా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరి థియేటర్లలో సాధించిన స్పందనకంటే ఓటీటీలో మెరుగైన ఆదరణ దక్కుతుందా లేదా అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. కొత్త కథలను, కొత్త నటీనటులను ప్రోత్సహించే ప్రేక్షకులకు 'తిమ్మరాజుపల్లి టీవీ' మంచి ఛాయిస్‌గా మారవచ్చు





## వివేక్ ఆత్రేయ కథకు గ్రీన్‌సిగ్నల్?

'ఇరుముడి' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్న అగ్ర నటుడు రవితేజ.. పనిలోపనిగా తన తర్వాత సినిమా కోసం కథల్ని వింటున్నారు. ఇందులో భాగంగా దర్శకుడు వివేక్ ఆత్రేయ చెప్పిన కథ విని, ఓకే చేశారనే వార్త ఫిల్మ్ వర్గాల్లో బలంగా వినిపిస్తున్నది. నిజానికి బాలకృష్ణతో వివేక్ ఆత్రేయ సినిమా ఉంటుందని అంతా అనుకున్నారు. కానీ మధ్యలో అనుకోకుండా కొరటాల శివ ఎంట్రీ ఇవ్వడం, ఆయన కథను బాలయ్య ఓకే చేయడంతో వివేక్ సినిమా ప్రశ్నార్థకంగా మారింది. దాంతో ఆలస్యం చేయకుండా తన దగ్గరున్న మరో కథను రవితేజకు చెప్పి, వివేక్ ఆత్రేయ ఓకే చేయించుకున్నారట. వివేక్ ఆత్రేయ తదుపరి సినిమా రవితేజతోనే.. ఇందులో మరో మాటకు తావులేదు.. అంటూ ఫిల్మ్‌వర్గాలు బలంగా చెబుతున్నాయి.

E-PAPER

visit us @ http://e-paper.sooryasena.com



www.sooryasena.com

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **PALVAI JANAIAH,** PRINTED AT **R K ART PRINTERS,** H.NO. 1-9-277/23/B, VIDYANAGAR, NALLAKUNTA, HYDERABAD-500044, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 2-1-115/3/16/1, MAMILLAGADDA, SURYAPET-508213,NALGONDA DISTRICT, TELANGANA STATE. **EDITOR : PALVAI JANAIAH,**
**RNI. No: TELTEL/2023/85598,** CELL: 9951241048, EMAIL : srptsurya@gmail.com